సత్యం శివం సుందరం
శ్రీ సరస్వతీ విద్యాపీఠము

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

సంపుటి : 48 సంచిక : 11 వెల : రూ. 18/- పుటలు : 36

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, కార్తీక - మార్గశిర మాసములు నవంబర్ : 2025



## నదీ దీపం







సప్తశక్తి సంగమం-ఆంధ్రప్రదేశ్

రామవరప్పాడు:- మహిళల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను సక్రమ మార్గంలో వినియోగిస్తే సమాజం అద్భుతంగా రూపొందుతుందని ప్రభుత్వ ఆయు ర్వేద వైద్య కళాశాల ప్రొఫెసర్ శిరీష అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ద కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో శనివారం ఎనికేపాడు విజ్ఞాన విహార పాఠశాల విద్యార్థుల మాతృమూర్తులతో రామవరప్పాడులోని పేరంటాలమ్మ దేవస్థానంలో 'సప్తశక్తి సంగమం' కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం జి.శైలజ, ఉపాధ్యాయిని సీతామహాలక్ష్మి, సేవికా సమితి మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.










బేతంచెర్ల :- సప్తశక్తి సంగమం మాతృ సమ్మేళనం మొదటి కార్యక్రమం బేతంచెర్ల మాధ్యమిక పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 85 మంది మాతృమూర్తులు పాల్గొన్నారు. సేంద్రియ మొక్కలు ఇంట్లో పండిస్తున్నటువంటి ముగ్గురు మహిళలకు సన్మానం జరిగింది.



ధూల్‌పేట:- దేశం పిలుపు మేరకు స్వదేశీ వస్తువులను మాత్రమే కొనాలి విదేశీ వస్తువులను బహిష్కరించాలి అనే నినాదంతో శ్రీ సరస్వతీ శిశు మందిర్ ధూల్‌పేట విద్యార్థులు ఇంటింటికి కరపత్రాలతో ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు ప్రధానాచార్యులు ఆచార్య మాతాజీల బృందం.

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

కలియుగాబ్ది-5127, శాలివాహన శక సం. 1947, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం కార్తీక-మార్గశిర మాసములు

సంపుటి : 50, సంచిక : 11 , నవంబర్ 2025 , పుటలు : 36, వెల : రూ.18/-



సంపాదకులు

**డా॥ అన్నదానం వేం. సుబ్రహ్మణ్యం**

ప్రచురణ కర్త

**పసర్తి మల్లయ్య**

**సంపాదకమండలి**

రావుల సూర్యనారాయణ

రమా విశ్వనాథన్

గోపగోని సప్తగిరి

అన్నావఝ్ఝల శ్రీనాథ్

పతకమూరి శ్రీనివాసరావు

**ముద్రణ**

సాయి లిఖిత ప్రింటర్స్, ఖైరతాబాద్,

హైదరాబాద్-500004

**డి.టి.పి.**

**స్ఫూర్తి గ్రాఫిక్స్**

శ్రీ సరస్వతీ విద్యాపీఠము,

ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004


**స్ఫూర్తి చందా వివరములు**

**స్ఫూర్తి వార్షిక చందా రూ॥ 220-00 లు**

యం.ఓ./ డి.డి. ద్వారా

శ్రీ సరస్వతీ విద్యాపీఠము పేరున

క్రింది చిరునామాకు పంపగలరు.


**శ్రీ సరస్వతీ విద్యాపీఠము**

ఇ.నెం. 6-3-597/ఎ/7,

వేంకటరమణ కాలనీ,

ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.

ఫోన్ : 040-23316160, 23316084

e - mail :sphoortissvp@gmail.com


## అమృతవాణి

శ్లో॥ అశ్రద్ధయా హుతం, దత్తం తపస్తప్తం కృతం చ యత్ ।

అసదిత్యుచ్యతే పార్థ ! న చ తత్ ప్రేత్య నో ఇహ ॥

**భావము :** అర్జునా! శ్రద్ధ లేకుండా చేసే హోమం, చేసిన దానం, తపస్సు, ఇతర శుభకర్మలు ఇవన్నీ అసత్తులు అనగా వ్యర్థమైనవి. ఉనికి లేనివవుతాయి. కర్మ చేసినా అశ్రద్ధతో చేస్తే జీవిత కాలంలో గాని, మరణానంతరం గాని యెటువంటి ప్రయోజనాలు సిద్ధించవు.

## ఈ సంచికలో . . .


సంపాదకీయము ... 04

కార్తీక దీపం విశిష్టత ... 05

ప్రార్థనలో మంత్రశక్తి ఉంది ... 07

మంచి నడవడి లేని మనుషులెందుకు!! ... 09

శ్రీ సరస్వతీ శిశు మందిరాల ఆధ్వర్యంలో "సప్త శక్తి సంగం" ... 11

భారతీయ విద్యా విధానానికి ఆధ్యాత్మికతే మూలాధారం ... 13

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ... 15

చిత్రమాలిక ... 17

శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు ... 21

లోకజ్ఞానం - 204 ... 22

పిల్లలను ఎలా పెంచాలి ? ... 23

శిశు వాటిక ... 25

పాఠశాల సంస్కృతి - (స్కూల్ కల్చర్) ... 27

చదువు సరే... సంస్కారం ఎలా ? ... 29

మాతృభాషలో విద్యాబోధన ... 31

వార్తలు ... 33



Printed & Published by **Pasarti Mallaiah** on behalf of Sri Saraswathi Vidya Peetham (Owner) and Printed at **Sai Likhita Printers**, # 6-2-959, D.B.Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd - 500004 and Published at Sri Saraswathi VidhyaPeetham, # 6-3-597/A/7, Venkataramana Colony, Khairatabad, Hyd - 500004 (Publication Place) Editor : **Dr. Annadanam Venkata Subrahmanyam.**

# విద్యాలయాల్లో క్రీడా స్ఫూర్తి రావాలి

**భా**రతదేశంలోని బాల బాలికల్లో గాని, యువతలో గాని క్రీడాసక్తి యెంతగా ఉండాలో అంతగా లేదు. పైగా కొరవడింది కూడ. స్వాతంత్ర్యం వచ్చాక విద్యావిధానంలో వ్యాయామానికి గాని, క్రీడలకు గాని తగిన స్థానాన్ని కల్పించక పోవడం ప్రధాన తప్పిదం. పైగా విద్యాలయాలలో క్రీడా మైదానాలే ఉండటం లేదు. వ్యాయామ విద్యను విద్యాలయాలలో నిర్బంధనాంశంగా చేయాలి. చైనా దేశం పాఠశాల స్థాయినుండే వ్యాయామ విద్యా బోధనను తప్పని సరిచేసింది. నెదర్లాండ్స్, ఫిన్లాండ్, పోలాండ్ వంటి చిన్న చిన్న దేశాలు కూడ అదే మార్గంలో పయనిస్తున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, రష్యా వంటి దేశాలు కూడా క్రీడలకు మిక్కిలి ప్రాధాన్యతనిస్తూ అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సంపాదించడానికి తీవ్రమైన కృషి చేస్తున్నాయి. భారత్ మాత్రం 2014 సం॥ తరువాత మాత్రమే ఈ దిశలో ఆలోచనను ముమ్మరం చేసింది.

2036లో జరిగే ఒలంపిక్స్ క్రీడలకు ఆతిథ్యమివ్వడానికి భారత్ నిర్ణయించి తన శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి తెలియజెప్పాలని చూస్తోంది. అయితే 2030లో జరిగే కామన్వెల్త్ క్రీడలకు కూడా భారత్ వేదిక కావడం కూడ ఒక విధంగా ఒలంపిక్స్‌కు ముందు తయారీగా మనకుపయోగపడవచ్చు. కామన్వెల్త్ క్రీడా పోటీలు బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందిన దేశాల మధ్య జరుగుతాయి. డెబ్బయికి పైగా దేశాలు ఈ పోటీలో పాల్గొంటాయి. అయితే 2010లో మన దేశంలో కామన్వెల్త్ క్రీడలు జరిగినప్పుడు ఆనాటి పాలకుల అసమర్థత, అవినీతి నేతల కారణంగా అపఖ్యాతి పాలయ్యాము. మరోసారి ఆ తప్పిదం జరగకుండా జాగ్రత్త వహించాలి. అయితే అహ్మదాబాద్‌లో అధునాతన క్రీడా వసతులు అందుబాటులోకి వస్తుండటం ఒక విధంగా సానుకూలాంశం. ఇటు వంటివి మన దేశంలో యెక్కడెక్కడ అవసరమవుతాయో అక్కడక్కడ సమకూర్చుకుంటూ ఒక విజన్ తో ముందుకు వెళ్ళవలసిన అవసరముంది.

2010 కామన్వెల్ క్రీడల్లో 101 పతకాలతో రెండో స్థానంలో నిలిచిన భారత్ 2022లో మళ్ళీ నాలుగో స్థానానికి పడిపోయింది. క్రీడాకారులు ఓటమికి కారణమయ్యే లోపాలను సరిదిద్దుకొని ప్రతిభను కనబరిచే దిశగా ప్రయత్నం చెయ్యాలి. ఇది ఒలంపిక్స్ పతకాలకు సోపానం కావాలి. ప్రతిభ ఉన్న క్రీడాకారులెందరో భారత దేశంలో ఉన్నారు. వారిని గుర్తించి వ్యవస్థాగతమైన తోడ్పాటు నందించవలసి ఉంటుంది.

అందుకే పాఠశాల స్థాయి నుండే చదువుతో పాటు బాలబాలికల్లో ఆటలు, వ్యాయామం పట్ల ఆసక్తి పెంచితే వాళ్ళు శారీరకంగా మానసికంగా కూడ వికాసం చెందుతారు. పాఠశాలలకు మైదానాలు తప్పని సరిగా ఉండేలా చూడాలి . వ్యాయామ విద్య నిత్య బోధనాంశాల్లో భాగం కావాలి. తల్లిదండ్రులు కూడ తమ పిల్లలు నిత్యమూ కొంత సమయం మైదానాల్లో గడిపేలా చూడాలి. శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఈ దిశలోనే నడుస్తూ తమ తమ పాఠశాలల్లో ని విద్యార్థులకు జిల్లా, ప్రాంత, క్షేత్ర, అఖిల భారతీయ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తూ క్రీడా స్ఫూర్తిని వికసింపజేస్తోంది. ★

ముఖ చిత్రకథనం

# కార్తీక దీపం విశిష్టత

- డా॥ అన్నదానం వేం.సుబ్రహ్మణ్యం





భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాలలో

**న కార్తీక సమో మాసః । న దేవః కేశవాత్పరం ॥**

**న చ వేద సమం శాస్త్రం । న తీర్థం గంగాయాస్సమమ్॥**

అని ఉంది.

అనగా కార్తీక మాసముతో సమానమైన మాసము లేదు. విష్ణువుతో సమానమైన దేవుడు లేదు. వేదాధ్యయన ముతో సమానమైన శాస్త్రాధ్యయనము లేదు, గంగతో సమానమగు తీర్థ క్షేత్రము లేదు అని చెప్పబడింది. అంటే ఇవి యీ మాసములో చాల విశిష్టమైనవని అర్థం. అంత మాత్రము చేత మిగిలినవి అప్రధానములని కావు. శివకేశవులకు శాస్త్రములో అభేదము చెప్పబడింది కాబట్టి యీ మాసములో రుద్రాభిషేకము కూడ విశిష్టతను సంతరించుకున్నది. మానవుడి చేత గంగాస్నానం చేయిస్తూ మానవుడికి ప్రకృతికి గల సంబంధాన్ని యిది తెలియజేస్తోంది. గంగను గంగామాతగా, గంగాదేవిగా మానవుడు పూజిస్తాడు. నీటి ప్రాముఖ్యతను, ఆవశ్యకతను గుర్తిస్తాడు. ప్రకృతి శోషణ చేయకుండా జల సంరక్షణ కలుషితం కాకూడదనే ఆలోచన కలుగుతుంది. ఆ నదీ తీరాలలో పుణ్యకార్యాలాచరిస్తాడు. నదీమ తల్లికి కృతజ్ఞత తెలుపుకుంటాడు. దీప జ్యోతులతో హారతి పడతాడు.

బ్రాహ్మీ ముహూర్త సమయంలోనే లేచి నదీ స్నానం, కాలువ స్నానం, బావిస్నానం చేసి స్త్రీలైతే దీపారాధనలు చేసి తరించే ప్రయత్నం చేస్తారు. భక్తి శ్రద్ధలతో శివాలయ సందర్శన, లేదా వైష్ణవాలయ సందర్శన చేస్తారు. ఈ కార్తీక మాసములో కార్తీక స్నానము, ఉపవాసము (ఛాయానక్తం అనగా పగలంతా ఉపవాసముండి నక్షత్ర దర్శనమైన తరువాత భుజించుట) కార్తీక దీపములు ప్రధానమైనవి. విశేష ఫలితాన్నిస్తాయి. దీప దానమిచ్చే సంప్రదాయం కూడ ఉంది. దీని వలన నరక ప్రాప్తి కలగదని విశ్వాసము.

హిందూ జీవనంలో యే ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలైనా దీపారాధనతో ప్రారంభమవుతాయి. దీపారాధనకంతటి మహత్వ స్థానము కల్పించబడినది. అసలు దీపమే భగవత్స్వరూపము. భగవంతుడు జ్యోతి స్వరూపుడు గదా! ఈ కార్తీక మాసంలో దీపము వెలిగించి సంధ్యా సమయంలో ఇంటి గడప, తులసికోట, దేవుని మందిరం వద్ద ఆ దీపాలు పెడతారు. దానినే కార్తీక దీపమంటారు. ఇప్పుడు కాండిల్స్, ఎలక్ట్రిక్ దీపాలు పెట్టే అలవాటు వచ్చింది. ఇది మంచిది కాదు. వాస్తవానికి ఆవు నెయ్యి లేదా నువ్వుల నూనెతో పెట్టిన దీపాలు పర్యావరణంలోని కాలుష్యాన్ని తొలగించడమే గాక సకారాత్మక ఆలోచనలు కూడ కలిగిస్తాయని శాస్త్ర నిరూపితమైంది.

**దీపజ్యోతి పరం జ్యోతిః దీప జ్యోతి జనార్దనః ।**

**దీపో హరతు మే పాపం దీప జ్యోతిర్నమోస్తుతే ॥**

ఇక్కడ పాపం అంటే భావ, ఆలోచనా కాలుష్యాలని అర్థం చెప్పుకోవాలి. దీపం వల్ల అవి తొలగిపోతాయి. పూజా సమయంలో గాని, కార్తీక దీపం గాని మీరే సందర్భంలో నైనా గాని వెలిగించే దీపం పరం జ్యోతి స్వరూపమే అంటే భగవత్స్వరూపం. దీపం సాక్షాత్తు జనార్దన స్వరూపమే. అందుకే దీపాలు వెలిగించే సంస్కృతి మనది. దీపాలు ఆర్పకూడదు. దీపం ఆరిపోయింది అని కూడ అనరు. అది అమంగళకర

వాక్యం. దీపం కొండెక్కింది అని అంటారు. నేడు పుట్టిన రోజు వేడుక సందర్భాలలో వెలిగించిన కొవ్వొత్తులను నోటితో ఊది ఆర్పుతున్నారు. అది మరింత అశుభసూచకం. హిందూ జీవన విశిష్టతను తెలుసుకోలేక అజ్ఞానం కారణంగా వచ్చిన వికృతులివి.

**శుభం కరోతి కళ్యాణం । ఆరోగ్యం సుఖ సంపదః ॥**
**ద్వేష బుద్ధి వినాశాయ । ఆత్మ జ్యోతిర్నమోస్తుతే ॥**

దీప ముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని సామెత. అంటే ఇల్లు చక్కబడాలంటే ఆయింట దీపం వెలుగుతుండాలి. దీపం లేని యింటిని దయ్యాల కొంప అంటారు. దీపమే యింటికి శుభాన్ని కలిగిస్తుంది. ఆరోగ్యాన్ని, సుఖ సంపదలను, సంస్కారాలను కలిగిస్తుంది. బుద్ధిలో ప్రవేశించే ద్వేషము అసూయా గుణములు నాశనమయ్యేలా ఆత్మ జ్యోతిని ప్రకాశింప చేస్తుంది.

**ఆత్మ జ్యోతి ప్రదీప్తాయ । బ్రహ్మ జ్యోతి నమోస్తుతే ॥**
**బ్రహ్మ జ్యోతి ప్రదీప్తాయ । గురుర్జ్యోతిర్నమోస్తుతే ॥**

ఆత్మ అనే జ్యోతిని ప్రకాశింపజేసుకోవాలి. ఆత్మ పరమాత్మ స్వరూపమని శాస్త్రాలు చెప్తున్నాయి. ఆత్మజ్యోతి బ్రహ్మజ్యోతిగ ప్రకాశించేలా, ఏకాగ్రతతో భక్తి జ్ఞాన, కర్మమార్గముల ద్వారా సాధన చేయాలి. ఆ వెలుగే గురు జ్యోతియై సాధనామార్గమును గూర్చి అవగాహన గలిగిన పరం జ్యోతి స్వరూపాన్ని యీ కార్తీక మాసమంతటా ప్రభాత, సంధ్యా సమయాలలో ముఖ్యంగా స్త్రీలు దీపాలు వెలిగించి పెడుతుంటారు. ఏ శుభకార్యాలలో నైనా దీపాన్ని వెలిగించే అర్హత మహిళలకే ఉంటుంది. మహిళ లేని పక్షంలో పురుషుడు వెలిగించ వచ్చు. దీపాలు పెట్టే సమయం కాబట్టే సూర్యాస్తమయం తర్వాత వచ్చే ప్రదోష కాలం బ్రాహ్మీముహూర్త కాలం వలె అత్యంత పవిత్రమైనది. శుభప్రదమైనది కూడ. ప్రదోషకాలంలో పరమశివుడు పరవశించి తాండవ మాడుతుంటాడట. ఆ శివతాండవాన్ని దర్శించడం కోసం సమస్త దేవతలు కైలాసానికి చేరుకుంటారట. ఆ సమయంలో పరమాత్మ స్వరూపమైన దీపాన్ని వెలిగించడం శుభకరమే గదా! దీపారాధన తడి బట్టలతో చేయకూడదు. పొడి బట్టలు కట్టుకునే చేయాలి.

నదులలో గాని, కాలువలలో గాని స్నానాలు చేసేటప్పుడు జలకాలుష్యం కలుగకుండా భక్తులు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. నీరు పంచమహాభూతాలలో ఒకటి. మనిషి శరీరంలో తగినంత నీరు లేకపోతే ప్రాణానికే ముప్పు కలిగే ప్రమాదముంది. అంటే అది ప్రాణాధార శక్తియే. అందుకే నీటిని మనం దేవతా స్వరూపంగా భావించి గంగామాత అంటాం. అది కలుషితం కాకూడదు. ప్రవహించే నీటిలో ఆరోగ్య లక్షణాలుంటాయి. అందుకే పర్వదినాల్లో నదీస్నానాలు, సముద్ర స్నానాలు హిందూ జీవనంలో చోటు చేసుకున్నాయి. నీటిలో ఉష్ణశక్తి కూడ ఉంటుంది. అటువంటి నదుల్లో స్నానాలు చేసేటప్పుడు రసాయనాలు కలిగిన సబ్బులు, షాంపూలు వాడకూడదు. సహజంగా నీటికున్న లక్షణాలు నశిస్తాయి. ఆ నీరు మానవులు, పశువులు త్రాగడానికుపయోగ పడవచ్చు. పంట పొలాలకు కూడ చేరే నీరుంటుంది. అవన్నీ రసాయనాలతో కూడిన యీ నీరు కారణంగా కాలుష్యం బారిన పడే అవకాశముంటుంది. కాబట్టి వాటిని వాడకూడదు. ధార్మికంగా ఆలోచించినా పర్వ దినాలలో తీర్థయాత్రలలో చేసే స్నానాలలో ఇటువంటి వస్తువులు వాడకూడదనే నియమముంది. కేవలం స్నానమే ఆచరణీయము. బహుశ నేటి శాస్త్రీయ దృక్పథానికనుగుణంగానే ఆ నియమం పెట్టి ఉండవచ్చు.

హిందూ జీవన పద్ధతిలో పండుగలు పర్వదినాలు, మానవుని జీవన శైలిని చక్కదిద్దడము, దోషరహితంగా చేయడం, ఆరోగ్యసంరక్షణతో పాటు ధార్మిక భావాల్ని పెంపొందించడమే ప్రధాన ఉద్దేశ్యంగా ఉంటుంది. ఇవి మత పరంగా కాకుండా సాంస్కృతిక పరంగా ఉంటాయి. ఆరాధనా పద్ధతి యేదైనా మానవాళి సంక్షేమానికి మేలు కలిగించే విధంగా ఉంటుంది కాబట్టి ప్రతి భారతీయుడు ఆచరించదగినటువంటిదే. అప్పుడు సమాజ కళ్యాణం జరుగుతుంది. అందుకే హిందూత్వం గురించి హిందూధార్మిక గ్రంథాలలోని విలువల గురించి విద్యార్థులకు తెలియజెప్పాలి. సమాజంలో కూడ అవగాహన కలిగించాలి. పెంపొందించాలి. ★

# ఆర్.యస్.యస్. ప్రార్థనలో మంత్ర శక్తి ఉంది!

- ప.పూ. సరసంఘచాలక్ డా॥ మోహన్ భాగవత్




రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్–అర్ఎస్ఎస్ స్వయంసేవకులు చేసే ప్రార్థన భగవంతుడితో పాటు మాతృభూమి పట్ల అంకితభావం, భక్తితో కూడిన సమష్టి సంకల్పమని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ అన్నారు. సెప్టెంబర్ 27న నాగపూర్‌లోని రేషమ్‌బాగ్ స్మృతి భవనం ప్రాంగణం లోని మహర్షి వ్యాస్ అడిటోరియంలో సంఘ ప్రార్థనకు సంబంధించిన ఆడియో వీడియో రికార్డును ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ప్రతీ స్వయంసేవక్ దృక్పథంలో వ్యక్తిగత దృఢసంకల్పం ఉన్నప్పటికీ వారికి ఉమ్మడి లక్ష్యం, విలువలు రోజూ పఠించే సంఘ ప్రార్థన నుంచి అలవడ్డాయని తెలిపారు. ఈ ప్రార్థన భారతమాత, భగవంతుడి పట్ల ప్రేమ, భక్తి, అంకితభావానికి వ్యక్తీకరణ. ఇది దేశానికి ఏం ఇవ్వగలమో తెలియజేస్తుంది. రికార్డు విడుదలతో ఈ ప్రార్థన ప్రజలందరికీ చేరుతుంది అని అన్నారు. ప్రార్థన విశిష్టతను వివరిస్తూ "సంఘ ప్రార్థన ఆర్ఎస్ఎస్ సమష్టి సంకల్పం. 1939 నుంచి స్వయం సేవకులు దైనందిన శాఖలో ఈ సంకల్పాన్ని పఠిస్తున్నారు. ఏళ్ల తరబడి సాధనతో ప్రార్థన మంత్ర శక్తిని సంతరించుకుంది. ఇది మాటలతో చెప్పేది కాదు.. ఎవరికివారు స్వయంగా అనుభవించాల్సిన విషయం" అని తెలిపారు. ఈ సందర్భంగా ఒక ఘటనను వివరించారు. "ఒక ప్రాథమిక పాఠశాల సంస్కృత ఉపాధ్యాయుడు దారిన పోతుండగా కొందరు చిన్నారులు పలుకుతున్న కొన్ని పదాలు అయనకు వినిపించాయి. ఆ పదాల వెనుక అర్థం అయనను అమితంగా ఆకట్టుకుంది. ఆ పదాలు ఏమిటని ఆయన ఉత్సాహం కొద్దీ ఆ చిన్నారులను అడిగారు, అందుకు వారు "మేం సంఘ స్వయంసేవకులం. ఇది మా ప్రార్థన" అని బదులిచ్చారు. ఆ సంస్కృత ఉపాధ్యాయుడు ప్రార్థనకు అత్యంత ప్రభావితుడయ్యారు. ప్రతీ రోజూ సంఘ శాఖకు హాజరు కావడం ప్రారంభించారు. అనంతరం బెంగాల్ ప్రాంత సంఘ్ చాలక్‌గా అవతరించారు. ఆయన పేరు కేశవచంద్ర చక్రవర్తి" అని మోహన్ భాగవత్ వెల్లడించారు. దృశ్య–శ్రవణ రికార్డును గురించి ప్రస్తావిస్తూ "ఈ పరంపర

(ప్రార్థనకు సంబంధించి) కూడా తప్పని సరిగా మొదలుకావాలి. ఈ మాధ్యమం అలాంటి ఒక పరంపరకు నాంది పలుకుతుంది. సాహిత్యం, సంగీతం, భావనలు ఏకమవ్వడం అరుదుగా జరుగుతుంటుంది. నేను ఈ ట్రాక్‌ను తొలిసారిగా విన్నప్పుడు అది ప్రార్థనను దాని వాతావరణంలోకి చేర్చిన వైనాన్ని గుర్తించాను. ఈ రికార్డు ఇంగ్లండ్ గడ్డపై తయారు కావడం బోనస్ గా మారింది. ఇది ఎంతగా విస్తరిస్తే అంతే స్థాయిలో కొత్త వ్యక్తులు సంఘతో అనుసంధానమవుతారు. సంగీతానికి శక్తి ఉంది. అది చెవుల ద్వారా నేరుగా హృదయంలోకి ప్రవేశిస్తుంది" అని తెలిపారు. ప్రార్థన ఆడియో వీడియో రికార్డు లండన్‌కు చెందిన రాయల్ ఫిల్‌హార్మోనిక్ ఆర్కెస్ట్రా, విదేశీ వాయిద్యకారుల సమన్వయంతో రూపొందింది. రికార్డుకు పేరొందిన గాయకుడు శంకర్ మహదేవన్ గాత్రం అందించారు. హిందీ అనువాదానికి వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ హరీష్ భిమాని గళం అందించగా, ప్రముఖ మరాఠీ నటుడు సచిన్ ఖేడేకర్ మరాఠీ అనువాదానికి గాత్రాన్ని అందించారు. ప్రార్థన ఆడియో వీడియో రికార్డు తెలుగు, గుజరాతీ సహా దాదాపు 14 భాషల్లో వెలువడింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ★

---

**ఇందిరానగర్:–** శ్రీ సరస్వతీ శిశుమందిర్, ఇందిరానగర్ పాఠశాల కోసం రూ॥1,00,000(లక్ష రూపాయలు) విరాళం గా అందించిన ఖమ్మం విభాగ్ ప్రెసిడెంట్ శ్రీ దేవకీ వాసుదేవరావు గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పాఠశాల ప్రధానాచార్యులు తెలియజేశారు. ★

# పరుగు పందెంలో ఒక్కడే

**1908** నాటి సంగతి, లండన్ ఒలింపిక్ క్రీడలు ఏర్పాటు చేయబడ్డాయి. ఎథ్లెటిక్స్ పరుగుపందేలు ప్రారంభం కాబోతున్నాయి పురుషుల నాలుగు వందల మీటర్ల పరుగుపందెం ఫైనల్‌కు చేరుకుంది మైదానంలో నలుగురు క్రీడాకారులు ఉన్నారు. వారిలో ముగ్గురు అమెరికన్లు, ఒక్కడే ఆంగ్లేయుడు.

నలుగురూ ఆ కాలంలో పరుగుపందెంలో ప్రసిద్దులు. అమెరికా క్రీడాకారులలో ఎవరో ఒకరు గెలుస్తారని ప్రేక్షకులు భావిస్తున్నారు. అమెరికన్లు ముగ్గురు, ఆంగ్లేయుడు ఒక్కడు ఉండడమే దీనికి కారణం. నలుగురూ పరుగుపందెంలో పాల్గొన్నారు. పరుగెత్తే సమయంలో అమెరికన్ క్రీడాకారులకు ఒక దుర్బుద్ధి పుట్టింది. ఆ ముగ్గురూ ఆంగ్లేయ క్రీడాకారుణ్ణి మూడువైపులలో – చుట్టుముట్టి పరిగెత్తసాగారు. అమెరికన్ క్రీడాకారుడు జైసీ కార్పెంటర్ బ్రిటన్ క్రీడాకారుడు హెల్ప్ వేలు ముందుగా పరుగెత్తసాగాడు. బ్రిటన్ అధికారులు నియమ విరుద్ధమైన ఈ పరిస్థితిని గమనించి అభ్యంతరం తెలిపారు. వాదోపవాదాలు జరిగాయి. తదనంతరం పరుగుపందెం ఆపి తిరిగి ప్రారంభించేందుకు నిర్ణయింపబడింది. జైసీని పరుగుపందెం నుండి బహిష్కరించారు.

ఈ నిర్ణయం విని మిగిలిన ఇరువురు అమెరికన్ క్రీడాకారులు కూడా రంగం నుండి వైదొలిగారు. ఇప్పుడు హాల్స్ వేర్ ఒక్కడే ట్రాక్‌లో ఉన్నాడు. అతను " పెరుగుపందెం పూర్తి చేశాడు. అవరోధాలు నడుమ ధైర్యం కోల్పోకుండా పరుగెత్తి మొట్టమొదటి స్వర్ణపతకాన్ని సాధించాడు. ఒలింపిక్ క్రీడలలోనే ఇది ప్రప్రథమం. రజత, కాంస్య పతకాలకు పోటీదారులే లేరు.

**జీవితం అనేది గమ్యం కాదు... గమనం మాత్రమే... ఎన్నిసార్లు ఓడినా గెలవడానికి అవకాశముంటుంది. గమ్యం అనంతం... గమనం అనేకం ...**

పద్యం-పరమార్థం


# మంచి నడవడి లేని మనుషులెందుకు!!



ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి

**చదివినయ్య కన్న చాకలియే మేలు**
**గృహము వేల్పు కన్న గేదె మేలు**
**బాపనయ్య కన్న బయనీడు మేలయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ !**

అర్థం: చదివిన+అయ్యకన్న = చదువు నేర్చుకొన్న పెద్ద మనిషి కంటే కూడా; చాకలియే = బట్టలు శుభ్రం చేసే వృత్తిలో ఉన్న వాడే; మేలు = శ్రేష్ఠుడు; గృహము వేల్పుకన్న = ఇంటి దైవం కంటే కూడా (ఇలవేల్పుకన్నా); గేదె = బఱ్ఱె; మేలు = ఉత్తమం కదా! బాపని+అయ్యకన్న = బ్రాహ్మణుని కంటెకూడా; బయనీడు = గాయకుడు, వాగ్గేయకారుడు; మేలయా = ఉత్తముడు కదా!



భావం : సుజనుడు కాని విద్యావేత్త కన్నా చాకలే మేలు. వరమీయకుండా ఊరికే ఉన్న ఇలవేల్పు కన్నా పాడిబఱ్ఱె మేలు. సజ్జనుడు కాని బ్రాహ్మణుని కన్నా బయనీడు (గాయకుడు) ఉత్తముడు కదా!

వ్యాఖ్య : చదివినోనికన్నా చాకలోడు మేలు అనే సామెత జన వ్యవహారంలో ఉంది. ఎందుకీ సామెత చెప్పుకొంటున్నారు అంటే బట్టలు సరిగా లెక్కపెట్టుకొని తీసుకుపోతాడు; ఉతికిన తర్వాత లెక్క తప్పిపోకుండా మళ్లీ తెచ్చిస్తాడు. అతనికున్న జ్ఞానం కూడా ఈ చదివినోళ్లకు లేదు అంటారు జానపదులు.

అయితే ఇక్కడ వేమన చదువు వద్దనడం లేదు. చదువుతో పాటు ఉత్తమ ప్రవర్తన నేర్చుకోవాలి; నీతి నిజాయితి గలవారై మెలగాలి. మంచి మానవ సంబంధాలను పెంపొందించాలి. చదువుకొన్నాను గదా అని ఓ మూలకు కూర్చోరాదు; ఆ చదువును సార్థకం చేయాలి. చదువుకున్న ఆ చాకలి బట్టలు చక్కగా లెక్కపెట్టి ఇస్తున్నాడు; ఉతకడం, శుభ్రం చేయడం, చలవ చేయడం అనే తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాడు. చదువు వల్ల తెలివి పెరుగుతుంది; ఆ తెలివితో పనిచేస్తే తనకూ, తన కుటుంబానికీ, దేశానికీ మేలు కలుగుతుంది. అందుకే అలనాడు హిరణ్యకశిపుడు చదువని వాడు అజ్ఞాని అవుతాడు. అందుకని గురువులు నిన్ను చదివిస్తారు; విజ్ఞుడవుకా అని ప్రహ్లాదుణ్ణి చండామార్కులనే శుక్రనందనుల కప్పగిస్తాడు.

**కం॥ చదువనివాడజ్ఞుండగు**
**చదివిన సదసద్వివేక చతురతగలుగున్**
**చదువగవలయును జనులకు**
**చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ!**
**చదువాలి; చదివి ఏది సత్తో (సత్యమో) ఏది**
**అసత్తా (అసత్యమో) తెలుసుకోవాలి; ఆచరించాలి.**

ఇక గృహము-వేల్పు-గేదె సంగతి! ఇలవేల్పును పూజిస్తాం, ధ్యానిస్తాం, భజిస్తాం, కీర్తిస్తాం, ప్రభో! నన్ను ఉత్తమునిగా తీర్చిదిద్దు అని మొత్తుకొంటాం! సిరిసంపదలివ్వు స్వామీ! అని ప్రార్థిస్తాం. ఈ ప్రార్థనలన్నీ మనం చేసే

పనిలో జరుగదు; పని సరిగా కాలేదా! ఫలితం బండి సున్న. అప్పుడు ఇలవేల్పును అధిక్షేపిస్తాం! నిందిస్తాం! భక్త రామదాసే ఆ పని చేశాడు. మనమెంత లెండి! సామాన్య మానవులం. కాని ఆ పాడి బఱ్ఱె చూడండి! దినాం పాలిస్తది; మన పిల్లల కడుపు నింపుతది. ఏం చేస్తాం! బతుకుబాటలో బఱ్ఱె మేలురా! అని దండం పెట్టుకొంటాం!

ఇక బాపనయ్య కన్న బయనీడు మేలు సంగతి! బాపనయ్య మంత్రం చదువుతాడు; మంత్రార్థం చెప్పడు. అర్థం తెలియకున్నా విశ్వాసంతో ఆచరిస్తాడు. కాని ఉల్లిగడ్డల బాపనయ్య కథ బయట పడ్డాక నమ్మేదెవ్వరు! బాపనయ్య మాట ఆచరించేదెవ్వరు! చెప్పేవి శ్రీరంగనీతులు సామెత గుర్తుకు వచ్చి అలా పాట పాడుతూ తాంబుర్ర మీటుతూ పోతున్న వేమన్ననూ, సిద్ధన్నను, పోతులూరి వీరబహ్మన్ననూ, అన్నమయ్యనూ, భక్త రామదాసన్ననూ, రాకమచర్ల వెంకన్నను నమ్ముకోవడం మేలని వారి పద గేయ కవితల సారాన్ని తెలుసుకొంటారు; చిల్లర రాళ్లకు మొక్కుతు ఉంటే చెడిపోదువురా ఒరే! ఒరే! అనుకొంటూ అనుష్ఠాన వేదాంత జీవనాన్ని స్వీకరించి సాగిపోతారు. అందుకే మంచి ప్రవర్తన ఉన్న విద్యావేత్తలు వరమిచ్చే వేల్పులు, మంత్రార్థం చెప్పి ఆచరించే బాపనయ్యలు ఆ సమాజానికి కావాలని వేమన్న వేదన. ★




**ఘోష్ వర్గ–శ్రీశారదాధామము:–** శ్రీ శారదాధామము యందు నిర్వహించబడిన ఘోష్ , కళాత్మక , రంగ్ మంచ్, సంగీతము ఉద్ఘాటన కార్యక్రమములో మార్గదర్శనము చేస్తున్న శ్రీ సరస్వతీ విద్యా పీఠము ప్రాంత కార్యదర్శి మాతృమూర్తి శ్రీమతి అనఘా వెంకట లక్ష్మి గారు .

వేదికపై శ్రీ సరస్వతీ విద్యా పీఠము ప్రాంత ఉపాధ్యక్షులు మరియు విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర కోశాధికారి పసర్తి మల్లయ్య గారు. ★





బాగులవాడ:– శ్రీ సరస్వతీ శిశు మందిర్, బాగులవాడ, నిర్మల్ లో విజయదశమీ రోజున పాఠశాల పున: ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పూర్వవిద్యార్తులను ఉద్దేశించి శ్రీ పతకమూరి శ్రీనివాసరాసరావు శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటన కార్యదర్శి మార్గదర్శనం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మన పాఠశాలను తీర్చిదిద్దాలి అని అన్నారు. సంఘశతాబ్ది ఉత్సవాల సందర్భంగా మన పాఠశాలను ఆధునీకరణ చేయవలసి ఉంది. ఈ కార్యక్రమం లో శ్రీ రావుల సూర్య నారాయణ దక్షిణ మధ్య క్షేత్ర ప్రశిక్షన ప్రముఖ్ గారు, శ్రీ నార్లపురం రవీంధర్ గారు జిల్లా అధ్యక్షులు సరస్వతీ విద్యా పీఠం నిర్మల్, మొదటి శిశుమందిర్ విద్యార్థి శ్రీ సాదుల సుధాకర్ గారు, శ్రీమతి అమిరిశెట్టి సుజాత గారు మరియు 350 పూర్వవిద్యార్థులు, శ్రీ సరికొండ దామోదర్ గారు విభాగ్ కార్యదర్శి, శ్రీ పురస్తు గోపాల్ కిషన్ గారు, జిల్లా కార్యదర్శి నిర్మల్ జిల్లా, పూర్వ విభాగ్ అదికారులు, జిల్లా అధికారులు, పూర్వ ఆచార్యులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానాచార్యులు నరేశ్ తెలియజేశారు. ★

# శ్రీ సరస్వతీ శిశు మందిరాల ఆధ్వర్యంలో "సప్త శక్తి సంగం"



- అన్నావజ్జల శ్రీనాథరావు




శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతం అంతటా "సప్త శక్తి సంగం" కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో వుండే శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల కేంద్రంగా ఈ సప్తశక్తి సంగం కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఈ కార్యక్రమానికి స్థానికంగా వుండే మహిళలు ఎంతో ఉత్సాహంగా భాగస్వాములు అవుతున్నారు.

ఈ సప్తశక్తి సంగం ద్వారా మహిళా చైతన్యంతో పాటు కుటుంబ ప్రబోధన్, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే మన చరిత్రలో స్వాతంత్ర పోరాటాలు చేసిన వీర వనితల చరిత్రను కూడా వివరిస్తున్నారు. చివరగా ఉమ్మడి కుటుంబం వున్న మహిళలకు సన్మానాలు, పర్యావరణ పరిరక్షణలో ముందజంలో వుంటూ, గో ఆధారిత, ప్రకృత వ్యవసాయం చేస్తున్న మహిళలకు పాఠశాల పక్షాన సన్మానం చేస్తున్నారు. కేశవనగర్ లో జరిగిన సప్తశక్తి సంగంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి శ్రీమతి అనఘా వేంకట లక్ష్మి గారు, కామారెడ్డి పాఠశాలలో జరిగిన సప్తశక్తి సంగం కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు గారు పాల్గొన్నారు. ★

---

## ఇంటింటికీ తిరుగుతూ స్వదేశీ వస్తువులపై అవగాహన కల్పిస్తున్న శిశు మందిర్ విద్యార్థులు




స్వదేశీ సప్తాహం లో భాగంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు "స్వదేశీ అవగాహన" కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ స్వదేశీ వస్తువులేవో, విదేశీ వస్తువులేవో వివరిస్తున్నారు. అలాగే స్వదేశీ వస్తువులనే వాడాలని, విదేశీ వస్తువులను బహిష్కరించాలని సూచిస్తున్నారు. దీంతో పాటు స్వదేశీ, విదేశీ వస్తువులతో కూడిన ఓ జాబితాను కూడా కుటుంబాలకు అందజేస్తున్నారు. దీని ద్వారా స్వదేశీ వస్తువుల జాబితా తొందరగా అర్థమవుతుందని, అందుకే కరపత్రాలను అందజేస్తున్నామని పాఠశాల ఆచార్యులు తెలిపారు.

నారాయణ పేటలో పాఠశాల ఆచార్యులు, విద్యార్థులందరూ స్వదేశీ అవగాహన పేరుతో ఓ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విదేశీ వస్తువుల దిష్టిబొమ్మను కూడా దహనం చేశారు.



మరో వైపు శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలల్లో కూడా విద్యార్థులకు స్వదేశీ వస్తువుల వాడకంపై పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో స్వదేశీ వస్తువుల ఎగ్జిబిషన్ ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా స్వదేశీ వస్తువులపై పిల్లలకు అవగాహన కలుగుతుందని, దీని ద్వారా తమ తమ ఇళ్లల్లో స్వదేశీ వస్తువులే వాడేలా విద్యార్థులు చూస్తారని ఆచార్యులు పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు తమ తమ ఇళ్లల్లో స్వదేశీ వస్తువుల వినియోగాన్ని పెంచారని, పోషకులు కూడా దీనిపై ఎంతో సంతృప్తి చెందుతున్నారని ఆచార్యులు తెలిపారు. ★

## తాతయ్య, నానమ్మల సమావేశం

**కళ్యాణదుర్గం:-** శ్రీ సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలో తాతయ్య,నాన్నమ్మల సమావేశం జరిగింది. ఈ సమావేశములో 80 మంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశములో ప్రధానాచార్యులు కరణం తిరుమల రావు తాతయ్య నానమ్మలను ఉద్దేశించి మాట్లాడుతూ గతములో జీవనశైలికి, కుటుంబ వ్యవస్థకు,విద్య కు,ఆర్థిక పరిస్థితులకు,సామాజిక సంబంధాలకు,వినోదాలకు,విలువలకు ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉన్నదని, మన అనుభవాల ద్వారా మన తరువాత తరాలకు స్నేహితులుగా మారి మన వారసత్వ సంపదైన మన సంస్కృతి సాంప్రదాయాలను,మన సనాతన ధర్మాన్ని,కుటుంబ విలువలను తెలియజేయాలని అన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న అనంతపురం సమితి శైక్షణిక ప్రముఖ్ నాగభూషణం గారు మాట్లాడుతూ మన ముందు తరాలవారు కష్టపడి జీవించారు, విలువలను కాపాడారు. అందువల్లే మనం మంచి స్థితిలో ఉన్నాం. ఇప్పుడు మన పిల్లలు, మన తరువాత తరాలు, కొత్తకాలంలో





పెరుగుతున్నారు. మొబైల్, టీవీ, ఇంటర్నెట్ వాడకం పెరిగింది. వీటివల్ల మంచి నేర్చుకోవచ్చు, కానీ తప్పు దారి వెళ్లే ప్రమాదం కూడా ఉంది. అందుకే మనం వారిని ప్రేమగా, సహనంతో మార్గనిర్దేశనం చేయాలి. ఆరోగ్యకరమైన ఆహారం తినడం, ప్రతిరోజూ చదవడం, పెద్దలను గౌరవించడం, పర్యావరణాన్ని కాపాడడం వంటి మంచి అలవాట్లు నేర్పించాలి.

మన అనుభవం, వారి ఉత్సాహం కలిసినప్పుడు మాత్రమే మంచి భవిష్యత్తు ఉంటుంది.అందుకే మనం తరువాత తరాలకు స్నేహితుల్లా మారి, వారికి దారి చూపుదాం. మన తరువాత తరాలకు వారధులం, సారథులం, మార్గదర్శకులం మనము కావాలని అన్నారు.

శ్రీనివాస మూర్తి గారు మాట్లాడుతూ తాతయ్య నానమ్మ ల సమావేశం ఏర్పాటు చేయడం అభినందనీయమని,ఈ ఆలోచన రావడం చాలా సంతోషం అని భావి తరాల పట్ల మా బాధ్యతలను గుర్తుచేయడం మమ్ములను సమాజ శ్రేయస్సుకు భాగస్వాములు కావాలని,మన వారసత్వం మన తరువాత తరాలకు అందించాలని ప్రోత్సహించడం నాకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ★

# భారతీయ విద్యా విధానానికి ఆధ్యాత్మికతే మూలాధారం

– డాక్టర్ కృష్ణ గోపాల్ జీ – సహ సర్ కార్యవాహ
– రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్

– తెలుగు అనువాదం డి.ఆర్.యస్.నరేంద్ర

భారతదేశ విద్యా విధానం, ప్రపంచంలోని మిగతా దేశాల విద్యా వ్యవస్థలతో పోలిస్తే పూర్తిగా భిన్నమైనది. దోపిడిదారుల దుష్ప్రభావంతో మన ప్రాచీన విశ్వవిద్యాలయాలు, మహా గ్రంథాలయాలు నశించినప్పటికీ, హిందూ సమాజం తక్షణమే జాగృతమై ఆధ్యాత్మిక విద్యా ధారను నిలబెట్టింది. మహత్తర పరిశోధనలు జరిగి ఉండవచ్చు, కానీ భారతీయులు మానవ మనస్సును మేల్కొలిపే విద్యను అంటే అంతర్మనోన్నతిని కాపాడగలిగారు. చిన్న పాఠశాలలు, గురుకులాలు ఆగకుండ సాగాయి. విద్య ద్వారా మానవ విలువల పరిరక్షణకు నిరంతర కృషి కొనసాగింది.

12వ శతాబ్దం నుంచి 18వ శతాబ్దం వరకు దాదాపు ఏడు శతాబ్దాలపాటు దేశంలోని ప్రతి భాషలో ప్రజాసంస్కరణకు, కుటుంబ ప్రబోధానికి, పిల్లల విలువల విద్యకు విశిష్టమైన కృషి జరిగింది. ఇలాంటి విశాల ఉద్యమం ప్రపంచ చరిత్రలో ఎక్కడా చోటుచేసుకోలేదు. మరాఠీలో జ్ఞానేశ్వర్, తూకారాం అభంగాలు, పంజాబులో గురువుల వాణీలు, ఉత్తరప్రదేశ్‌లో రామచరితమానస్, అసోంలో శంకరదేవ–మాధవదేవుల నామఘోషా, బర్గీత్, అలాగే బంగాళంలో (బెంగాల్) చైతన్య మహాప్రభు చేసిన ఆధ్యాత్మిక విద్యా విస్తరణ ఇవన్నీ భారత సాంస్కృతిక పునరుజ్జీవనానికి చిహ్నాలుగా నిలిచాయి.

భారతదేశంలో భౌతిక విద్యా–ఆధ్యాత్మిక విద్యా సమన్వయం ఎప్పుడూ తెగిపోలేదు. ప్రజా సాహిత్యం ద్వారా మానవ హృదయోన్నతి, కుటుంబ వ్యవస్థ, తల్లిదండ్రుల పట్ల గౌరవం, గృహశుద్ధత, జీవిత సత్యనిష్ఠ వంటి విలువల బోధన నిరంతరం కొనసాగింది.

ఇదే భారతీయ విద్యా పద్ధతి, ప్రపంచ విద్యా విధానాల మధ్య ఉన్న అసలు తేడా. మన విద్యా విధానానికి మూలం ఆధ్యాత్మికతే. అది అంతర్మనస్సు ఉద్ధరణ, హృదయ విశాలత, ప్రేమ, స్నేహ భావం, సత్యనిష్ఠ, మహిళల పట్ల గౌరవం, దోపిడీ, అన్యాయాల నుండి దూరంగా ఉండే జీవన విలువలను బోధిస్తుంది. ఈ విలువలు కాలగమనంలో ఎప్పుడూ నశించలేదు. అవే భారతీయ విద్యా ఆత్మను నిలబెట్టిన శాశ్వత సూత్రాలు.

ఆంగ్లేయులు భారతదేశ విద్యా వ్యవస్థపై తీవ్రంగా దాడి చేశారు. మన ప్రాచీన విద్యా తత్వం, సంస్కారపరమైన మూలాన్ని పూర్తిగా చెరిపివేశారు. గ్రామాగ్రామానికి విస్తరించి ఉన్న పాఠశాలలలో సాగిన విలువల విద్యను నాశనం చేశారు. అన్ని విద్యాసంస్థల గుర్తింపులను (Recognition) రద్దు చేశారు. దాని స్థానంలో పాశ్చాత్య విద్యా విధానం తన భిన్నమైన రాగ–రంగాలతో భారత భూభాగంలో ప్రవేశించింది. కానీ అందులో ఆధ్యాత్మికత అనే మూలతత్వం లోపించింది. మన విద్యా విధానం భౌతిక జ్ఞానం, ఆధ్యాత్మిక జ్ఞానం అనే రెండు మార్గాలను కలుపుకుని నడిచేది. అవి ఒకే నాణానికి రెండు వైపుల్లాంటివి. అయితే, ఆంగ్లేయుల విద్యా విధానంలో భౌతిక విద్య ఒక్కటే ప్రధానంగా నిలిచింది. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, పరిపాలన, న్యాయశాస్త్రం ఇవన్నీ ఉన్నప్పటికీ, ఆధ్యాత్మికతకు అక్కడ స్థానం లేదు. నిజాయితీ, నైతికత, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలు వారి విద్యలో చర్చకు కూడా రాలేదు. జీవన విలువల పట్ల మౌనం వారి విధానాన్ని నిర్వచించింది.

ఈ పరిస్థితి భారతదేశ ఆలోచనాపరులను ఆందోళనకు గురి చేసింది. ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, బంకిమ్ చంద్ర ఛటోపాధ్యాయ వంటి మేధావులు భారతీయ విద్యా విలువల పునరుద్ధరణకు కృషి ప్రారంభించారు. 19వ శతాబ్దం ద్వితీయార్థం నుంచే విద్యా దిశపై చర్చలు, ఆందోళనలు మొదలయ్యాయి.

కొంతమంది రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించారు, మరికొందరు కొత్త పాఠశాలలను ప్రారంభించారు. ఆర్థికంగా బలమైనవారు విశ్వవిద్యాలయాల స్థాపనకు ముందుకొచ్చారు. ఈ క్రమంలో విద్యా పునరుజ్జీవనానికి ఓ విశాల చరిత్ర ఆవిష్కృతమైంది. దేశంలోని ప్రతి ఆలోచనాపరుడూ ఆంగ్ల విద్యా విధానం అసంపూర్ణమని, దానిలో ఏదో లోటుందని గుర్తించాడు. అందుకే వారు తమతమ మార్గాల్లో ఆ లోటు తీర్చే ప్రయత్నం చేశారు.

స్వామి శ్రద్ధానంద్ గురుకుల్ కాంగ్రీ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్ విశ్వవిద్యాలయాన్ని, మదన్ మోహన్ మాలవ్య కాశీ హిందూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. మహాత్మా గాంధీ కూడా రెండు విశ్వవిద్యాలయాలను ప్రారంభించారు. లోకమాన్య తిలక్ వంటి మహానుభావులు ఈ దిశలో అపార కృషి చేశారు. వారి వ్యక్తిత్వం, దూరదృష్టి, విద్యా సంస్కరణల పట్ల అంకితభావం భారత విద్యా పునరుజ్జీవనానికి మార్గదర్శకమయ్యాయి.

పాశ్చాత్య విద్యా వ్యవస్థలో లోపాలున్నాయని భారతీయ ఆలోచనాపరులు ఒకే స్వరంతో అంగీకరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా దేశవ్యాప్తంగా అనేక సంస్థలు ఆ లోటును పూరించేందుకు ముందుకొచ్చాయి. విద్యా రంగంలో విలువల ఆధారిత మార్పు కోసం అనేక విద్యాసంస్థలు స్థాపించబడ్డాయి. రామకృష్ణ మిషన్, చిన్మయ మిషన్, మాతా అమృతానందమయి మఠం, డి.ఏ.వి. పాఠశాలలు, గాయత్రీ పరివార్, శ్రీ శ్రీ రవిశంకర్ సంస్థలు. ఇవన్నీ విద్యా రంగంలో ప్రామాణికమైన మార్గదర్శక ప్రయత్నాలు చేపట్టాయి. దీనివల్ల సాధారణంగా ప్రాచుర్యంలో ఉన్న ఆంగ్ల విద్యా విధానం భారతీయ మనసుకు శాంతి, సంతృప్తి ఇవ్వలేకపోయింది. ఆధ్యాత్మికత, సంస్కారంతో అనుసంధానం లేని విద్య మన సమాజ ఆత్మను సంతృప్తి పరచలేకపోయింది.

దేశంలోని దాదాపు ప్రతి జిల్లాలోనూ దేశభక్తులు, హిందుత్వ భావనతో ఉన్న ప్రామాణిక వ్యక్తులు విద్యా పునరుజ్జీవనానికి తమ వంతు కృషి చేశారు. కొన్నిచోట్ల అగ్రవాల్ సభ, మరికొన్నిచోట్ల భార్గవ సభ, ఇంకా కాయస్థ పాఠశాల, లేదా బ్రాహ్మణ సమాజం వంటి సంస్థలు ఏర్పడి భారతీయ విలువల ఆధారంగా విద్యను పునర్నిర్మించే దిశగా అడుగులు వేశాయి. ఎవరికి సాధ్యమైతే వారు, తమ సామర్థ్యానికి తగ్గట్టు, భారతీయ జనచైతన్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యా రంగంలో సమగ్ర మార్పులు తీసుకురావడానికి ప్రయత్నించారు. అదే భారత విద్యా ధోరణి సమాజ అవసరాలకు అనుగుణంగా స్వయంగా పరిణామం చెందే జీవన విద్య.

విద్యా భారతీ సంస్కారభరిత, సమగ్ర విద్యా విధానం దిశలో ఆరంభమైన ఉద్యమం.

మనము ప్రారంభించిన ఈ విద్యా ప్రయత్నానికి స్పష్టమైన లక్ష్యం ఉంది. ఇతర సంస్థల ప్రయత్నాలు కూడా ప్రశంసనీయం, ఆదర్శప్రాయమైనవి. దానిపై ఎలాంటి అభిప్రాయభేదమూ లేదు. అయితే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు తనదైన దృష్టికోణం ఉంది. స్వయంసేవకుల పనితీరుకు, దేశాన్ని చూసే విధానానికి ప్రత్యేకమైన ఆత్మ ఉంది.

ఏదైనా మంచి విద్యా ప్రయోగం ఎక్కడైనా జరిగితే దానిని విస్తృతంగా పంచడం, అందరికీ తెలిసేలా చేయడం మన విధానం. ఆ ఆలోచన సమాజానికి చేరగానే, ఇతర ప్రాంతాల్లోనూ అదే విధానాన్ని అనుసరించడం ప్రారంభమవుతుంది. ఇలాగే 'విద్యా భారతీ' అనే మహత్తర విద్యా సంస్థ క్రమంగా నిర్మితమైంది. దాని లక్ష్యం భారతీయ విద్యా వ్యవస్థను సమగ్రంగా, లోపరహితంగా మార్చి, దేశ ఆత్మకు అనుగుణమైన సిద్ధాంతాలు, విలువలు, ఆలోచనలు కలిగిన విద్యా విదానాన్ని రూపొందించడం.

మన దేశం, హిందూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి దిశగా విద్యా రంగంలో అవసరమైన ప్రతిదాన్ని చేయాలనే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమం ఆరంభమైంది. ప్రతి ఒక్కరి మనస్సులో ఈ విశాలమైన లక్ష్యం యొక్క లోతు, స్పష్టంగా


(తరువాయి భాగం 26వ పుటలో...)

విజ్ఞానం

# భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ

✍ ఉపద్రష్ట లక్ష్మణసూరి





ఇస్రో

(గత సంచిక తరువాయి భాగం ...)

రాబోయే రోజుల్లో జరుపబోయే భారతీయ అంతరిక్ష స్టేషన్ నిర్మాణాన్ని దృష్టిలో పెట్టుకుని 2024వ సంవత్సరం డిసెంబర్ 30న ఇస్రో యొక్క 99 వ ప్రయోగం నిర్వహించడం జరిగింది. పిఎస్ఎల్వీ సి 60 (PSLVC6) ద్వారా స్పేడ్ ఎక్స్ (SPADEX) ప్రయోగం జరిగింది. స్పేస్ డాకింగ్ ఎక్స్పరిమెంట్ ద్వారా భవిష్యత్తు అంతరిక్ష కార్యకలాపాలకు కీలకమైన సాంకేతికత అయిన ఉపగ్రహ డాకింగ్ సామర్థ్యాలను ప్రదర్శించే దిశగా 99వ ప్రయోగం జరిగింది. భూమి దిగువ కక్షలో రెండు చిన్న అంతరిక్ష నౌకలు SDX01 చేజర్ మరియు SDXO2, టార్గెట్ కలుసుకునే డాకింగ్ టెక్నాలజీ అభివృద్ధి చేశారు. రెండు వేగంగా కదులుతున్న అంతరిక్ష నౌకలను ఒకే కక్షలోకి తీసుకెళ్లి వాటిని దగ్గరగా తీసుకువచ్చి వాటిని కలిపి ఒకే యూనిట్ గా ఏర్పరిచే సంక్లిష్టమైన ప్రక్రియ స్పేస్ డాకింగ్ . రష్యా, అమెరికా, చైనా తర్వాత ఈ డాకింగ్ టెక్నాలజీ కలిగిన నాలుగో దేశంగా భారతదేశం ఆవిష్కరింపబడింది. ఈ రెండు ఉపగ్రహాలు అధునాతన సెన్సార్లు మరియు ప్రొపల్సన్ వ్యవస్థలను ఉపయోగించి స్వయం ప్రతిపత్తితో డాక్ అంటే కలుపబడ్డాయి. చంద్రయాన్ 4 అంతరిక్ష కేంద్రాలు భారతదేశ ప్రణాళిక బద్ధంగా చేపట్టబోయే భారతీయ అంతరిక్ష స్టేషన్ వంటి భవిష్యత్తు మిషన్లకు స్పేస్ డాకింగ్ చాలా కీలకం.

4. ఇన్ని విజయాల వెనుక వున్న ఏకైక శక్తి భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో. బెంగళూరు ప్రధాన కార్యాలయంగా మానవజాతి సేవలో అంతరిక్ష సాంకేతికత నినాదంగా డాక్టర్ వి. నారాయణన్ చైర్మన్గా సుమారు 20వేల మంది శాస్త్రవేత్తల బృందంతో 21 ప్రధాన కేంద్రాలతో పనిచేస్తున్న సంస్థ. శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్ దార్శనికతతో రూపుదిద్దుకున్న అంతర్జాతీయ ప్రమాణాలు కల భారత దేశానికి ఆర్థిక పరిపుష్టి చేకూరుస్తున్న అంతరిక్ష విజ్ఞాన సంస్థ. 1975లో సోవియట్ అంతరిక్ష సంస్థ నుండి ఆర్యభట్ట మొదటి ఉపగ్రహాన్ని ప్రయోగించడం ద్వారా ఇస్రో తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ వస్తోంది. పీఎస్ఎల్వీ (PSLV) రాకతో భారత అంతరిక్ష కార్యక్రమానికి ఒక పెద్ద ఊపు వచ్చింది. ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు, భారతదేశ భూ పరిశీలన ఉపగ్రహాలు, ఓషన్ సెట్, ఎమీ సెట్ లాంటి ఎన్నో ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన అతిపెద్ద ఉపగ్రహ వ్యవస్థ ఇన్సాట్ సిరీస్. ఇండియన్ నేషనల్ సాటిలైట్ సిస్టం అనేది

దేశ టెలి కమ్యూనికేషన్ వ్యవస్థ. టెలి కమ్యూనికేషన్స్ ప్రసారం, వాతావరణ శాస్త్రం, రక్షణ అవసరాలను తీర్చడానికి ఇస్రో నిర్మించిన బహుళార్థ సాధక భూస్థిర ఉపగ్రహాల శ్రేణి. 1983లో మొదటి ఇన్సెట్ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టినప్పటి నుండి insat ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అతిపెద్ద దేశీయ కమ్యూనికేషన్ వ్యవస్థగా మారింది. జీ సాట్ 9, సార్క్ ఉపగ్రహం భారతదేశపు పొరుగు దేశాలకు కమ్యూనికేషన్ సేవలందిస్తోంది. IRNSS భారతదేశం అభివృద్ధి చేసిన నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. కల్పన ఉపగ్రహం ఇస్రో యొక్క మొట్టమొదటి ప్రత్యేక వాతావరణ **ఉపగ్రహం.**

4. నాసా ఎక్స్ ఎం ఫోర్ మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ లోకి వెళ్లి సురక్షితంగా వచ్చిన తొలి భారతీయ వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంసు శుక్ల అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్నారు. తనతో పాటు ఐఎస్ఎస్ కి తీసుకువెళ్లిన త్రివర్ణ పతాకాన్ని ఎక్స్ ఎం 4 జ్ఞాపికను శుక్ల మన ప్రియతమ ప్రధానమంత్రికి అందజేశారు. వికసిత భారత్‌కు దూతగా 2040 లో భారతీయ వ్యోమగామి చందమామపై అడుగు పెట్టబోతున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారెందుకు ఎక్స్ ఎం ఫోర్ మిషన్ యాత్ర కీలకపాత్ర పోషిస్తుంది. సంస్కరణల ద్వారా అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనంత్ టెక్నాలజీస్ స్కై రూట్ టెక్నాలజీస్ లాంటి సంస్థల ద్వారా అంతరిక్ష వాణిజ్యం 800 కోట్ల డాలర్లకు చేరింది .వచ్చే శతాబ్దికి 4500 కోట్ల డాలర్లకు చేరబోతోంది. వ్యోమ మిత్ర పేరుతో రోబోను అంతరిక్షంలోకి పంపే దిశగా శాస్త్రవేత్తలు ప్రణాళికలు రచిస్తున్నారు. 2040 లో చంద్రుడిపై భారత వ్యోమగామి పాదం మోపి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వికసిత భారత ఖ్యాతిని చాటుతారు. 2035 కల్లా మనకు సొంత భారతీయ అంతరిక్ష కేంద్రం భారత్ స్పేస్ స్టేషన్ ఉంటుంది అని సగర్వంగా కేంద్ర ప్రభుత్వం తెలిపింది. శుభాంస శుక్ల యాత్రతో ప్రతి భారతీయుల విద్యార్థుల ఎంపిక అంతరిక్ష విజ్ఞానంగా ఇచ్చుక పెరిగింది. ఇస్రో ఇక ఆకాశమే సరిహద్దుగా భారీ ప్రయోగాల లక్ష్యంగా పనిచేస్తుందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి నారాయణ అన్నారు. ఇస్రోకు వాణిజ్య సంస్థగా ఉన్న న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ కు పీఎస్ఎల్వీ రాకెట్‌ను అప్పగించడంతో ఈ ఏడాది పిఎస్ఎల్వి ఎన్ వన్ పేరుతో నూతన ప్రయోగాన్ని చేపట్టనున్నారు. నాసాతో కలిసి ఏడు ప్రయోగాలు లక్ష్యంగా ఇప్పటికే కార్యాచరణ రూపు దాల్చుకుంది. ఎల్వీఎం త్రీ ఎం ఫైవ్ రాకెట్ ద్వారా వాణిజ్యపరంగా బ్లూ బర్డ్ సిక్స్ ప్రయోగం, పిఎస్ఎల్వి ఎన్ వన్ రాకెట్ ద్వారా టిడిఎస్ వన్ అనే ఉపగ్రహ ప్రయోగం, హెచ్ ఎల్ వి ఎం గగనయాన్ వన్ ద్వారా అన్ క్రూడ్ ఆర్బిటార్ టెస్ట్ పైలెట్ వన్ ప్రయోగం, జిఎస్ఎల్వి ఎఫ్ 17 ద్వారా IDRSS 1 ఉపగ్రహ ప్రయోగం, గగనయాన్ టీవీ డి2 ద్వారా టెస్ట్ వెహికల్ అబాట్ మిషన్ 2, పిఎస్ఎల్వీ సి 62 ద్వారా వర్షన్ సెట్ 3జి ప్రయోగాలకు ఇస్రో ఇప్పటికే రూపకల్పన చేసింది. 2025 లో వరుసగా గగనయాన్-2, గగనయాన్-3 ప్రయోగాలు లక్ష్యంగా శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించారు. చంద్రయాన్ ఫోర్

(తరువాయి భాగం 24వ పుటలో...)

# శిశుమందిరాల్లో బతుకమ్మ సంబరాలు



గట్టుప్పల్




కె.డి.ఆర్.నగర్–వనపర్తి




నల్గొండ



పోసానిపేట



సదాశివపేట



తడ్కపల్లి




శ్రీనివాసనగర్

# పూర్వ విద్యార్థుల సమ్మేళనము దృశ్యమాలిక




**కేశవనగర్:–** భాగ్యనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్, కేశవనగర్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనము 2000–2001 బ్యాచ్ వారు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభ్యుడు పూర్వ కార్యదర్శి రాచపూడి పూర్ణ చంద్రరావు, సమితి అధ్యక్షుడు మురళీమోహన్, పూర్వ ప్రధానాచార్యులు సుబ్బరాంమోహన్ రావు, పూర్వ విద్యార్థులు మరియు పూర్వాచార్యులతో, సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమంలో ఆనందాన్ని, జ్ఞాపకాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు ఈ రోజు నిజంగా గుర్తుండిపోయేలా చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు! తెలియజేశారు.

---




## శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం (2003 –04 S.S.C BATCH)

**భీంగల్:–** J.B.N ఫంక్షన్ హాల్ లో శ్రీ సరస్వతీ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన S.S.C 2003–04 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముందుగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లి అక్కడ తాము గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఫంక్షన్ హాల్ లో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు డాక్టర్ జి. బసంత్ రెడ్డి గారిని, ప్రధాన కార్యదర్శి జి. నర్సయ్య గారిని, సంయుక్త కార్యదర్శి పి. మనోహర్ గారిని, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జి. అరవింద్ కుమార్ గారిని, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి. నర్సారెడ్డి గారిని. ఆనాడు విద్యార్థులకు 10వ తరగతి బోధించిన ఉపాధ్యాయులు టి. గంగాధర్, నీల ప్రవీణ్, నీల రవి, జెట్టి రవి, వెంకట నరసయ్య, సిరిలంచ అశోక్, భైరవ సార్, బ్రహ్మరౌతూ రవీంద్ర వర్మ, నల్ల రవి గార్లను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు డాక్టర్ జి. బసంత్ రెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో నేర్చుకున్న సంస్కారాన్ని కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి, దేశాభివృద్ధికి పాటుపడాలని తాము చదువుకున్న పాఠశాలకు రక్షణ కవచంలా ఉండాలని చదువు చెప్పిన ఉపాధ్యాయులను మర్చిపోకూడదని వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదుకోవాలని చెప్పినారు.

---




**హన్మకొండ :–**శ్రీ సరస్వతీ శిశుమందిర్ హన్మకొండ పాఠశాలలో పూర్వ ఆచార్యుల ఆత్మీయ సమ్మేళనము జరిగింది. ఈ కార్యక్రమంలో లింగం సుధాకర్ రెడ్డి గారు, చిలకమారి సంజీవ గారు, చిలకమారి పంచాక్షరి గారు. విభాగ్, పాఠశాల కార్యకారిణి సభ్యులు, పూర్వ ఆచార్యులు, ప్రస్తుత ఆచార్యులు పాల్గొన్నారు.

# జగిత్యాల వాణీ నగర్ గీతా విద్యాలయంలో పూర్వ విద్యార్థుల చేయూతతో రూపుదిద్దుకున్న క్రీడా ప్రాంగణం





**జగిత్యాల:-** వారంతా 20 ఏళ్ల క్రితం పట్టణంలోని గీతా విద్యాలయం పాఠశాలలో విద్యనభ్యసించారు. ప్రస్తుతం దేశ, విదేశాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ జీవితములో స్థిరపడ్డారు. విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో తాము ఉన్నత స్థానంలో నిలవడానికి కారణమైన తల్లి లాంటి పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా ఏదైనా చేయాలని సంకల్పించారు. వారి ఆలోచనలకనుగునంగా పాఠశాల ఆవరణలో పూర్వ ప్రాథమిక విద్యార్థుల కోసం క్రీడా ప్రాంగణాన్ని తయారు చేసి చిన్నపిల్లలను పాఠశాలకు ఆకర్షించే విధంగా ఆకర్షణీయమైన ఆట వస్తువులు, క్రీడా సామాగ్రిని ఏర్పాటు చేశారు. గీతా విద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 1994-95 ఎస్ ఎస్ సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం సందర్భంగా పూర్వ ప్రధాన ఆచార్య న్యేలమడుగు శంకరయ్య చేతుల మీదుగా క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభింప చేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తమ బాల్య స్మృతులను గుర్తు చేసుకొని క్రీడా ప్రాంగణంలో చిన్న పిల్లల మాదిరిగా ఆడు కున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గీతా విద్యాలయం పాఠశాలలో తమకు విద్యతో పాటు క్రమశిక్షణ అనుశాసనం దేశభక్తి లాంటి విషయాలను ఆచార్యులు బోధించడం వల్లే తాము జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగామని తెలిపారు. ముందు ముందు కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. పాఠశాలకు బాలల క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థులను పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నగర సంఘచాలక్ జిడిగే పురుషోత్తం,గీతా విద్యాలయం కమిటీ సభ్యులు లక్ష్మణరావు, అశోక్ రావు, మహిపాల్ రెడ్డి, అరుణ్ పాఠశాల ప్రధానాచార్య శివకుమార్, పూర్వ విద్యార్థులు పాక శ్రీనివాస్, పూట్కూరి రామకృష్ణారెడ్డి, బొడ్డుపల్లి శ్రీనివాస్, కందుకూరి శ్రీనివాస్, అనంత్, భాగ్యలక్ష్మి, షర్మిల, శ్రీలత, నక్కల రవీందర్ రెడ్డి, రేగొండ ప్రసాద్, పూర్వ ఆచార్యులు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





# మహిళల చైతన్యం కోసం శక్తి సంగమం




**శిక్షణకేంద్రం-శ్రీశారదాధామము:-** శ్రీ సరస్వతీ విద్యాపీఠం మహిళా లోకంలో చైతన్యం పెంచే దిశగా 'సప్త శక్తి సంగం' అనే పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు. విద్యాభారతి దక్షిణ భారత క్షేత్ర అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ చామర్తి ఉమా మహేశ్వర రావు తెలిపారు. దీని ద్వారా సుమారు 76 లక్షల మంది మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించే అద్భుతమైన కార్యక్రమం అని వివరించారు. ఈ కార్యక్రమాన్ని రాణి దుర్గావతి జయంతి సందర్భంగా. అక్టోబర్ 5 నుంచి మొదలు పెట్టామని, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి అయిన జనవరి 23 వరకు జరుపుతామని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న 24 వేల విద్యా భారతి విద్యాలయాలతో పాటు. మన రాష్ట్రంలో ఉన్న 225 విద్యాలయాల్లో మాతృ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సప్తశక్తి సంగం గురించి వివిధ దశలలో కార్యాచరణ జరుగుతోందని వివరించారు. విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ద్వారా 'మహిళల యొక్క', 'మహిళల కొరకు', 'మహిళల ద్వారా' నప్తశక్తి సంగం గొప్ప చైతన్యం తీసుకొస్తుందని వివరించారు.

---

# యోగ సింధూర్ - శ్రీశారదాధామము




శ్రీ శారదాధామము నందు ప్రారంభము అయిన " యోగ సింధూర్"

ఉభయ తెలుగు రాష్ట్రములకు చెందిన 118 మందికి " యోగ ఆసన్ ప్రాణాయామము" నందు రెండు రోజుల పాటు యోగ సమగ్ర శిక్షణ వర్గ జరిగింది. రాబోవు యోగా దినోత్సవమునకు చక్కటి యోగ శిక్షకులుగా రాణించే విధంగా శిక్షణ ఇచ్చారు.

---




శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల నారాయణఖేడ్ పాఠశాలలో 2008 -2009 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించడం జరిగింది. వాళ్ళకు విద్యాబుద్ధులు నేర్పిన ఆచార్యులు మాతాజీలు సమ్మేళనంలో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాలకు 2 కంప్యూటర్స్ మరియు 1 కలర్ ప్రింటర్ ను అందించడం జరిగింది. వీరికి పాఠశాల ప్రభంధకారిణి తరుపున ధన్యవాదాలు తెలియజేశారు.

# శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు



పూజిత –7వ తరగతి–బేతంచర్ల



అభిరాం–7వ తరగతి–భీంగల్




యల్. చరణ్ కుమార్ –4వ తరగతి–ధూల్‌పేట



సి. శృతి –10వ తరగతి–జమ్మలమడుగు



వై. జనార్ధన్ –5వ తరగతి – కళ్యాణదుర్గం



పి. అక్షర –3వ తరగతి–కార్వాన్

జి.కె.

# లోక జ్ఞానము - 204



అయాచితుల లక్ష్మణరావు

## అక్టోబర్ 2025, "స్ఫూర్తి" ఆధారంగా

1. యముని చెల్లెలు పేరేమి ?
2. అద్వైతాన్ని మొదటగా ప్రస్థాపించినది ఎవరు?
3. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏ సం॥లో స్థాపించబడింది?

### ధర్మం – సంస్కృతి

4. వ్యాసమహర్షి చెబుతూండగా మహా భారతాన్ని ఎవరు రాశారు?
5. పరమ శివుని ఆవాసస్థానం ఏది?
6. కర్ణాటకలోని ధర్మస్థలలో గల ఆలయంలో కొలువైన దైవం ఎవరు?

### గణిత – వైజ్ఞానిక అంశములు

7. 7 తర్వాత వచ్చే ప్రధాన సంఖ్య ఏది?
8. దీర్ఘ చతురస్రం చుట్టుకొలత సూత్రం ఏది?
9. మానవ శరీరంలో అతి పెద్ద అవయవం ఏది?

### సామాజిక శాస్త్రాలు

10. భారత దేశం ఏ ఖండంలో ఉంది?
11. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవీ ప్రమాణ స్వీకారం ఎవరు చేయిస్తారు ?
12. గోదావరి నది ఎక్కడ సముద్రంలో కలుస్తుంది?

### సమకాలీన అంశాలు

13. అమెరికా తర్వాత AI హబ్‌ను గూగుల్ భారత్‌లో ఎక్కడ ఏర్పాటు చేస్తోంది?
14. తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక ఎప్పుడు జరుగనుంది?
15. నవంబరు 6, 11 తేదీలలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరుగనున్నాయి.

## లోక జ్ఞానము -203 సమాధానములు

1. దీనదయాల్ జీ
2. శేషప్పకవి
3. విశ్వకర్మ
4. ఇంద్రజిత్తు
5. ఐరావతం
6. ధృతరాష్ట్రుడు
7. కాలేయం
8. ఆర్యభట్ట
9. రెండు
10. 22
11. కర్కాటకరేఖ
12. బాబూ రాజేంద్ర ప్రసాద్
13. సి. పి. రాధాకృష్ణన్
14. నేపాల్
15. అనంతపురం

## 135 జతపరచుము సమాధానాలు

| | | |
|---|---|---|
| 1 | త. | ఢిల్లీ |
| 2 | ప. | ఢాకా |
| 3 | చ. | ఇస్లామాబాద్ |
| 4 | ట. | కొలంబో |
| 5 | క. | నైపిడో |

## 136- జతపరచుము

| | | |
|---|---|---|
| 1. విష్ణుమూర్తి | ( ) | క. సింహం |
| 2. పరమశివుడు | ( ) | చ. శునకం. |
| 3. పార్వతి | ( ) | ట. గరుత్మంతుడు |
| 4. కుమారస్వామి | ( ) | త. వృషభం |
| 5. కాలభైరవ | ( ) | ప. నెమలి |

విద్యార్థులు గానీ,
ఆచార్యులు గానీ మీ సమాధానాలను వ్రాసి స్ఫూర్తి విభాగానికి తపాల / కొరియర్ ద్వారా పంపగలరు.
(లేదా)
sphoortissvp@gmail.com కి మెయిల్ ద్వారా పంపగలరు.

# పిల్లలను ఎలా పెంచాలి ?



✍ - లింగం సుధాకర్ రెడ్డి

ఉమ్మడి కుటుంబాలు లేకుండా పోయాయి. చిన్న కుటుంబాలు. ఇంట్లో భార్యాభర్తలు, వారికి ఒకరిద్దరు పిల్లలే ఉంటున్నారు – భార్యభర్తలిద్దరూ ఉద్యోగస్థులైనప్పుడు పిల్లల పెంపకంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేక పోతున్నారు. పని ఒత్తిడిలో అలిసి పోయి పిల్లల ప్రవర్తన, వాళ్ల నడవడి తల్లిదండ్రులు తెలుసుకోలేక పోతున్నారు. ఇద్దరూ సంపాదిస్తున్నారు కాబట్టి ఎంత ఫీజు అయినా చెల్లించి పిల్లలను బడిలో చేర్పించి తమ బాధ్యత తీరిపోయిందనుకుంటున్నారు. కాని బాల్యం గాడి తప్పేందుకు తొలి కారణం కుటుంబంలోని వాతావరణమేననీ మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు.



ఈ మధ్య పదోతరగతి చదువుతున్న విద్యార్థి క్రికెట్ బ్యాట్‌కోసం, పెద్దవాళ్లు ఎవరూ లేని సమయంలో ప్రక్కింట్లో దొడ్డిదారిన ప్రవేశించి బ్యాట్‌ను దొంగిలించి, అడ్డు వచ్చిన పసి బాలికను హత్యచేశాడు. ఇలాంటి అనేక వార్తలువింటున్నాము. అసలు ఇలా బాల్యం గాడి తప్పేందుకు తొలి కారణం కుటుంబంలోని వాతావరణమే నని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు, చోరీలు, లైంగిక వేధింపులు, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడుతున్న నిందుతుల్లో ఎక్కువ మంది కుటుంబ పరిస్థితులతో దారి తప్పిన వారే ఉంటున్నారని పోలీసులు విశ్లేషిస్తున్నారు.

"పసి పిల్లలు దేవుడితో సమానం. బాల్యావ్యస్థ మైనపు ముద్దలాంటిది. పెద్దలు దాన్ని ఎలా మలిస్తే, అలా రూపు దిద్దుకుంటుంది. సహజంగా పిల్లలు సృజన శీలురు. వారిలో దైవీ గుణాలు ఎన్నో ఉంటాయి. పెంపకం ప్రభావంతో పెద్దయ్యే కొద్ది అవి దూరమూ కావచ్చు లేదా మరింతగా రాణించనూ వచ్చు" అంటూ ఈ మధ్య ఈనాడు పత్రిక అంతర్యామిలో రావులపాటి వెంకట రావు "పిల్లలను ఎలా పెంచాలి" శీర్షికన మహాభారతంలోని విషయాన్ని సందర్భోచితంగా చాలా చక్కగా వ్రాశారు.

కురుక్షేత్ర సంగ్రామం జరిగి అంతా మరణించిన తరవాత గాంధారి, ధృతరాష్ట్రులను ఓదార్చడానికి శ్రీకృష్ణుడు వచ్చాడు. పుత్రశోకంతో ఉన్న గాంధారి కృష్ణుడితో "నాకు వందమంది కొడుకులు పుట్టారు, యుద్ధంలో అందరూ మరణించారు. కనీసం ఒక్కడినైనా బతికించలేక పోయాడు భగనంతుడు" అంది బాధగా. శ్రీకృష్ణుడు సమాధానం చెబుతూ 'అత్తా! నీ భర్తకు చూపులేదు. అందుకే ఆయన తన సంతానాన్ని చూసుకోలేకపోయాడు. నీకు చూపు ఉంది. కానీ భర్తమీద ప్రేమతో కళ్లకు గంతలు కట్టు కున్నావు. కన్నతల్లే చూడని వారిని భగవంతుడు చూడలేదని ఎలా నెపం వేస్తావు?' అన్నాడు. కళ్లు ఉండీ చూడలేని తల్లి ఆలనా కరువైంది. అంధుడైన తండ్రి అతి మమకారంతో, మోహంతో పిల్లలను అదుపు చేయలేదు. ఈ విధంగా తల్లిదండ్రులు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తే పర్యవసానం అనర్థదాయకమే ననడానికి ఇంతకన్నా రుజువేం కావాలి?

బాల్యంలో తాము అనుభవించిన కష్టాలూ, సమస్యలు తమ పిల్లలకు రాకూడదని తల్లిదండ్రులు భావిస్తుంటారు. అందుకని పిల్లల కోరికలు తీర్చడానికి తమ

తలకుమించి ప్రయత్నిస్తుంటారు. దాంతో కుటుంబ వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోలేని పిల్లలు నేల విడిచి సాము చేస్తారు, గాలిలో మేడలు కడతారు. నైతిక విలువలకు తిలోదకాలిస్తారు. న్యాయం, ధర్మం అంటే తెలియక అక్రమ దారులు పడతారు. దాంతో సమాజంలో అకృత్యాలు, అరాచకాలు విజృంభిస్తాయి. గాంధారి కథ నుంచి మనం నేర్చుకోవాల్సింది అదే. పిల్లలకు తొలి గురువులు తల్లిదండ్రులే వారికి నీతి, నియమాలు, ప్రేమానుబంధాలు, మానవీయ విలువలను ఉగ్గుపాలతో నేర్పాలి. పెద్దవుతున్న కొద్దీ ఆ పాఠాల పరిధిని పెంచుతూ కుటుంబ ఆర్థిక స్థితిగతులు, సామాజిక సంబంధాల గురించి చెప్పాలి. ఉచితానుచితాలు బోధపరిచి సరైన దారిలో పెట్టాలి. పిల్లలు హోదాలోనే కాదు, వ్యక్తిత్వంలోనూ తమను మించిన మంచివారు కావాలని ఆశించాలి. ★

(16వ పుట తరువాయి భాగం ...**భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ** )

కు సంబంధించిన అన్ని పనులు ఇప్పటికే పూర్తవుతున్నాయని త్వరలో మరెన్నో అంతరిక్ష యాత్రలు చేపట్టనున్నట్లు ఇస్రో శాస్త్రవేత్తల బృందం ప్రకటించింది.

5. ఇస్రో దేశ భవిష్యత్తును మార్చబోయే ఒక బృహత్తర కార్యక్రమం చేపట్టింది. ఏకంగా 40 అంతస్తుల భవన m అంత ఎత్తులో భారీ రాకెట్‌ని నిర్మించే పనిలో ఉంది. 35 కిలోల పే లోడ్ తో మొదలుపెట్టిన భారతీయ అంతరిక్ష ప్రయాణం ఇప్పుడు 75 వేల కిలోల బరువైన ఉపగ్రహాలను భూకక్షలోకి తీసుకెళ్లగలిగే ఒక మెగా రాకెట్‌ను తయారు చేసే స్థాయికి ఎదిగింది. ఆర్థికంగా దేశానికి ఎనలేని ప్రయోజనాలు చేకూరుస్తూ నిత్యజీవితంలో మానవులకు ఎదురవుతున్న ఎన్నో సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తోంది. గగనయానుకు, లోతైన అంతరిక్ష పరిశోధనలకు, చంద్రుడు అంగారకుడు పై భవిష్యత్తు మిషన్లకు కొత్త ఊపు రాబోతోందని శాస్త్రవేత్తల బృందం తెలిపింది. ఇప్పటికే భారత్‌కు భూ కక్ష్య లో 55 ఉపగ్రహాలు ఉన్నాయి. వచ్చే మూడు నాలుగు ఏళ్లలో వీటి సంఖ్య నాలుగు రెట్లు పెరగబోతోంది. తక్కువ ఖర్చుతో ప్రయోగాలు చేసే ఏకైక దేశంగా ప్రపంచవ్యాప్తంగా ఇస్రో అందరి మన్ననలను పొందుతోంది. మంగళ్‌యాన్, చంద్రయాన్ త్రి మిషన్ల విజయాలు ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు మంచి పేరు తెచ్చి పెట్టాయి. ఇన్ని విజయాలను సొంతం చేసుకున్న ఇస్రో ఘన కీర్తిని నేటి తరానికి తెలిపే దిశగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం నేషనల్ స్పేస్ డే ప్రతి పాఠశాలలో అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన క్విజ్ కార్యక్రమాలు, డిబేట్లు, ఎస్సే రైటింగ్ హెక్టాన్స్, సంచార వైజ్ఞానిక ప్రదర్శనశాలలు, ఇస్రో రోబోటిక్స్, భారతీయ అంతరిక్ష హ్యాక్తాన్, గెలాక్సీ కిడ్స్ క్లబ్ లాంటి కార్యక్రమాలు చేపట్టి ప్రతి భారతీయుడికి అంతరిక్షం పై అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలకు మార్గదర్శకాలు జారీ చేసింది.

జై భారత్ జై విజ్ఞాన్. ★



**సదాశివపేట :–** శ్రీ సరస్వతీ శిశుమందిర్, సదాశివపేట పాఠశాల యల్.కె.జి. విద్యార్థులు వృత్తాకారపు కార్యకలాపాల్లో (CIRCULAR CTIVITIES) పాల్గొన్న చిన్నారులు. ★

# శిశు వాటిక

- కొత్తపల్లి ఉమ
ప్రాంత శిశువాటిక ప్రముఖ్, తెలంగాణ

ఇది తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు సులభంగా చదివి అర్థం చేసుకునేలా రూపొందించబడింది.

పాఠ్యపథకం అంటే ఏమిటి?

**శిశువాటికలో క్రియాకలాపాలు పాఠ్యపథకంలో భాగమేనా?**

జాతీయ విద్యా విధానం (NEP) 2020 ప్రకారం, ప్రాథమిక విద్యలో–ముఖ్యంగా శిశువాటికలో పిల్లల అభివృద్ధికి అనుకూలంగా సమగ్ర, సమన్వయమైన మరియు ఆటల ఆధారిత విద్యా విధానం అమలులోకి వచ్చింది.

అవును, క్రియాకలాపాలు ఇప్పుడు పాఠ్యపథకంలో ముఖ్యమైన భాగం. ఇవి కేవలం ఆటలుగా కాకుండా, పిల్లల అభివృద్ధికి ప్రధాన సాధనంగా మారాయి.

**NEP 2020లో పాఠ్యపథకం క్రియాకలాపాల ప్రాముఖ్యత**

పాఠ్యపథకం మూడు ప్రధాన మార్గాలను ఆధారంగా తీసుకుంటుంది:

1. కళల ఆధారిత విద్య – చిత్రకళ, సంగీతం, నాట్యం, హస్తకళ వంటివాటి ద్వారా నేర్చుకునే విధానం.
2. క్రీడల ఆధారిత విద్య – శారీరక ఆరోగ్యం మరియు బృందస్ఫూర్తికి ప్రోత్సాహం.
3. క్రియాకలాపాల ఆధారిత విద్య – చేతులతో చేసే, అనుభవాల ద్వారా నేర్చుకునే పద్ధతి

**క్రియాకలాపాల ద్వారా కలిగే లాభాలు**

క్రియాకలాపాలు పిల్లల్లో అనేక రకాల సామర్థ్యాలను అభివృద్ధి చేస్తాయి:

1. పిల్లలు ఇంటిలో గానీ, పాఠశాలలో గానీ పరిసరాలను శుభ్రంగా ఉంచే అలవాటు ఏర్పరుచుకుంటారు.
2. ఆత్మవికాసానికి అవసరమైన ఏకాగ్రత పెరుగుతుంది.
3. స్మరణశక్తి మరియు జ్ఞాపకశక్తి మెరుగవుతుంది.
4. పిల్లలు విషయాలను త్వరగా నేర్చుకుంటారు.
5. సృజనాత్మకతకు మార్గం తయారవుతుంది.
6. విషయపరమైన అవగాహన మరింత లోతుగా కలుగుతుంది.
7. ఆనందంగా నేర్చుకునే పద్ధతి ఏర్పడుతుంది.
8. ప్రతి క్రియాకలాపం కూడా పిల్లల వయస్సు, దాని స్వభావానికి అనుగుణంగా సమయ పరిమితితో ఉండాలి.

**క్రియాకలాపాల రకాలు**

1. వ్యక్తిగత క్రియాకలాపాలు – స్వయం అభ్యాసానికి దోహదం చేస్తాయి.
2. బృంద క్రియాకలాపాలు – సహకారం, పరస్పర సహాయం పెంచుతాయి.
3. సమూహ క్రియాకలాపాలు – సామూహిక బాధ్యతను అభివృద్ధి చేస్తాయి.

**పాఠ్యపథకాన్ని అమలు చేయవలసిన బాధ్యత ఎవరిది?**

1. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులిద్దరిది.
2. పిల్లల విద్యలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ఇద్దరూ సమానంగా భాగస్వాములు కావాలి. వీరిద్దరి పాత్రలు ఇన్నాళ్లూ వేరుగా ఉండినా, ఇప్పుడు పరస్పర మార్పు చేయదగినవి.

- తల్లిదండ్రులు – ఇంటి ఉపాధ్యాయులుగా వ్యవహరించాలి.
- ఉపాధ్యాయులు – పాఠశాల తల్లిదండ్రులుగా వ్యవహరించాలి.

**జననం నుండి మూడేళ్ల వయస్సు వరకు తల్లిదండ్రుల కోసం సూచనలు**

ఈ వయస్సులో భాషాభివృద్ధి, సామాజిక మరియు భావోద్వేగ ఎదుగుదల మొదలవుతాయి. పిల్లలతో మాట్లాడేటప్పుడు ఈ సూచనలు పాటించండి.

1. చిన్న వాక్యాలు మాట్లాడండి.

2. సాధారణం కంటే కొంచెం గట్టిగా మాట్లాడండి.
3. అతిశయోక్తులతో మాట్లాడండి.
4. హావభావాలతో మాట్లాడండి.
5. ప్రతి పదాన్ని స్పష్టంగా పలకండి.
6. పదాల మధ్య విరామం ఇవ్వండి.
7. మాట్లాడే సమయంలో శరీర కదలికలు సరిగా ఉండాలి.
8. ఒకే వాక్యాన్ని రెండు లేదా మూడు సార్లు పునరావృతం చేయండి.
9. కళ్ళలోకి చూసి మాట్లాడటం – భాష నేర్చుకోవడానికి ఎంతో అవసరం.
10. చిన్న పిల్లల భాష ఉపయోగించకండి – సరళంగా, స్పష్టంగా మాట్లాడండి.
11. పిల్లలు తామే తినగలిగే సమయంలో వారికి తినిపించవద్దు.
12. పిల్లలతో గడిపే సమయంలో ఇతర పనులు చేయకండి.
13. సరళమైన వాక్యాలు ఉపయోగించండి.
14. పిల్లల కొరకు తల్లిదండ్రులు బొమ్మలతో కూడిన పుస్తకాలు చదవాలి.
15. టీవీ భాషాభివృద్ధికి తక్కువగా సహాయపడుతుంది – పిల్లలకి ముఖాముఖి సంభాషణ అవసరం.
16. పిల్లలు దగ్గరి చూపుతో ఉంటారు. పెద్దదిగా కనిపించే వస్తువు సమీపంలో ఉన్నట్టు, చిన్నదిగా కనిపించే వస్తువు దూరంగా ఉన్నట్టు భావిస్తారు. అందువల్ల, రీడింగ్ కార్డులు ఉపయోగించడం మంచిది వీటిని పిల్లలు పట్టుకోవచ్చు, దగ్గరగా చూడవచ్చు, దీనివల్ల భాషను త్వరగా నేర్చుకుంటారు, ఇతరులతో కలిసి నేర్చుకునే అవకాశమూ ఉంటుంది.

**ముగింపు మాట**

పిల్లల మొదటి మూడు సంవత్సరాలు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమైనవి. ఈ సమయంలో క్రియాకలాపాల ద్వారా విద్య పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ఆనందం మరియు ఆసక్తికరమైన అధ్యయనం పెంచుతుంది.

తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులుగా మనం కలిసి పని చేస్తే, మన పిల్లల భవిష్యత్తు బంగారంగా మారుతుంది. ★

(14వ పుట తరువాయి భాగం ...)

ఉండాలి. ఈ ప్రాథమిక దృష్టిని ఎప్పటికప్పుడు ప్రాథమిక స్థాయిలోనూ గుర్తుచేయడం అవసరం. కొన్ని పాఠశాలలను స్థాపించడం మాత్రమే ఈ ఉద్యమం పరిమిత లక్ష్యం కాదు. కానీ ప్రతి పాఠశాలే ఈ మహత్తర గమ్యాన్ని సాకారం చేసే మూలాధారమవుతుంది. దానికి అవసరమైన ప్రతిదాన్ని చేయాలనే ధృఢ నిశ్చయం ఉంది. అందుకు పాఠశాలలను స్థాపించడం, ఉపాధ్యాయుల శిక్షణ,ప్రధానోపాధ్యాయుల శిక్షణ, దాతలను ప్రోత్సహించడం, భవనాల నిర్మాణం, ఆధునిక అవసరాలన్నింటినీ నెరవేర్చే స్థాయిలో విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం. మన ముందు లక్ష్యం స్పష్టంగా ఉంది. సమాజాన్ని సంస్కారంతో, విద్యను ఆధ్యాత్మికతతో కలిపి, భారతీయ జీవన విలువలతో కూడిన సమగ్ర విద్యా వ్యవస్థను నిర్మించడం.

మనం తరచుగా ఆత్మపరిశీలన చేసుకునేటప్పుడు కొన్ని ప్రశ్నలు మనసులో నిలిచిపోతాయి. మనం ఇంతదూరం ఎలా వచ్చాము? మనలోని ఏ మంచి విషయాలు మన ప్రయాణానికి బలమయ్యాయి, వాటిని ఎలా నిలబెట్టుకోవాలి? ఈ యుగంలో ఏ కొత్త అంశాలు మనం స్వీకరించాలి? మన దృష్టి ఎల్లప్పుడూ ఒకటే దేశం, సమాజం, సంస్కృతి కోసం ఎక్కడైనా ఉన్న మంచి అంశం కనిపిస్తే, దాన్ని స్వీకరించడానికి మనం ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి.

**“ఆ నో భద్రాః క్రతవో యంతు విశ్వతః?”**

అని ఒక వేద వాక్యం చెబుతుంది.

అంటే ప్రపంచంలోని అన్ని దిక్కుల నుండి శుభ ఆలోచనలు మనవైపు రావాలి. కానీ, ఏదైనా కొత్త విషయం స్వీకరించేటప్పుడు జాగ్రత్త అవసరం. దానిని మన సంస్కృతికి,

(తరువాయి భాగం 30వ పుటలో...)

# పాఠశాల సంస్కృతి - (స్కూల్ కల్చర్)



- రావుల సూర్యనారాయణ

**మా**న్యులు శ్రీ దీనానాథ్ బత్రా గారు కురుక్షేత్రలోని గీతా విద్యాలయాన్ని దేశంలోనే ఒక ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దిన ప్రధానాచార్యులు. పదవీ విరమణ అనంతరం చాలా కాలం విద్యాభారతి అఖిల భారతీయ శిక్షాసంస్థాన్‌కు అఖిల భారతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. గొప్ప విద్యావేత్త, రచయిత.

వారు 1994-95 విద్యా సంవత్సరంలో మన ప్రాంత ప్రధానాచార్యుల సమావేశం తీసికొన్నారు. ఆ సమావేశంలో ప్రధానాచార్యుల బాధ్యతల గురించి చర్చిస్తూ అనేక ప్రశ్నలు వేశారు అందులో మచ్చుకు కొన్ని.

1. మీ పాఠశాల విద్యార్థుల క్రమశిక్షణ ఎలా ఉందో చూడాలంటే ఎప్పుడు, ఎక్కడ చూడాలి ?
2. మీ పాఠశాల పరిశుభ్రత చూడాలంటె ఎక్కడ చూడాలి.
3. ప్రధానాచార్యులు పాఠశాలకు ఎప్పుడు చేరుకోవాలి ? రాగానే చేయవలసిన పనులు ఏవి ?

ఇలా అనేక విషయాలపై ప్రధానాచార్యులతో చర్చించి పై మూడు విషయాల సారాంశాన్ని ఈ విధంగా తెల్పారు.

1. పాఠశాల సెలవల్లో విద్యార్థులు బయటకు వచ్చిన తదుపరి వారి వ్యవహారం ఎలా యుంటుందో, అదే మన పాఠశాల క్రమశిక్షణ.
2. విద్యార్థులు ఉపయోగిస్తున్న శౌచాలయాలను చూస్తే మన పాఠశాల శుభ్రత తెలుస్తుంది.
3. ప్రధానాచార్యులు పాఠశాలకు కనీసం అర గంట ముందు చేరుకొని ముందుగా పాఠశాల ముఖద్వారానికి నమస్కరించి ప్రాంగణంలోకి ప్రవేశించాలి. నేరుగా ప్రధానాచార్యుల గదికి వెళ్ళి సరస్వతీ మాత చిత్రపటం ముందు జ్యోతి వెలిగించాలి. తదుపరి పాఠశాల ప్రాంగణం అంతా తక్కువ ధ్వనితో వినిపించే విధంగా మైక్ ద్వారా దేశ భక్తి, దైవ భక్తి గీతాలు వినిపించాలి. ఆ తదుపరి పిల్లలందరిని చిరునవ్వుతో పాఠశాలలోకి ఆహ్వానించాలి. ఈ విధంగా అనేక అంశాలపై శ్రీ దీనానాథ్ బత్రా గారు మార్గదర్శనం చేశారు.

అక్టోబర్ మాసములో నేను, ప్రాంత మరియు విభాగ్ శైక్షణిక ప్రముఖులు కలిసి భాగ్యనగర్ విభాగ్‌లోని ఒక పాఠశాలకు వెళ్లి రెండు రోజులు పరిశీలన చేశాం. అందులో గమనించిన ముఖ్య విషయాలలో కొన్నింటిని మీ ముందుంచుచున్నాను.

ఆ పాఠశాల ప్రధానాచార్యులు ప్రతి దినం ముఖ ద్వారానికి నమస్కరించి పాఠశాలలో అడుగు పెట్టాడు.

ఆచార్యులు, విద్యార్థులందరు కూడ అదే పద్ధతిలో నమస్కరించి దేవాలయ ప్రాంగణంలోకి వెళ్తున్న పవిత్ర భావనతో వెళ్ళారు.

ప్రధానాచార్యుల వారు తన గదిలోకి వెళ్ళి సరస్వతీ మాత ముందు జ్యోతి వెలిగించి రెండు శ్లోకాలు చదివి తన పనులు ప్రారంభించారు. ప్రార్థనలో ఆచార్యులకు ప్రత్యేక ఆసనాలు లేవు. విద్యార్థుల మధ్య ఆనందంగా కూర్చొని విద్యార్థులతో పాటు గీత్, ఏకాత్మతా స్తోత్రం మొ॥నవి అభ్యాసం చేశారు. ఆ రోజు జన్మదినం గల విద్యార్థులచే జ్యోతి ప్రజ్వలన గావించి, వారికి శుభం కలగాలని "జన్మ దిన మిదం" అనే మంత్రం అన్ని చోట్ల చదువుతారు. దానితో పాటు ఆ విద్యార్థులకు ఆ తరగతి ఆచార్యులు వచ్చి నుదుట తిలకం దిద్ది హారతి ఇవ్వటం విశేషం.

ఈ పాఠశాలలో మరో విశేషం. ప్రార్థన సమయంలో మాత్రమే కాకుండా భోజన మంత్ర సమయంలో విద్యార్థులు, ఆచార్యులతో పాటు ఆ సమయంలో అందరు కర్మచారులు ఏ పని చేస్తున్నను ఆ పని ఆపి నమస్కార స్థితిలో స్థిరంగా నిలబడి భోజన మంత్రం పఠిస్తారు. అదే విధంగా శాంతి మంత్ర

సమయంలో కూడ చేస్తారు. ఇది ఒక చక్కటి సాంప్ర దాయం. మరో ముఖ్య విషయం: నేను, భూషణ్ గారు 5వ తరగతి విద్యార్థులను పరిశీలిస్తున్న సమయంలో ప్రసంగ వశాత్తు "మీలో మొబైల్‌ను ఉపయోగించని వారెందరున్నారు ?" అని ప్రశ్నించగా 25 మంది విద్యార్థులలో 10 మంది విద్యార్థులు లేచి నిలబడ్డారు. ఆ 10 మందిని నా వద్దకు పిలిచాను. అందులో ఒక బాలికను వారి తల్లి మొబైల్ నంబర్ అడిగి వారి అమ్మతో మాట్లాడాను. సంభాషణ ఈ విధంగా కొనసాగింది.

- అమ్మా ! నమస్కారం
- నమస్కారం. మీరెవరండి ?
- నేను మీ పాప చదువుతున్న పాఠశాల నుండి మాట్లాడుతున్నాను.
- చెప్పండి. ఆచార్యుల వారు
- మీ పాప ప్రతి రోజు ఎంత సమయం మొబైల్‌తో గడుపుతుందో చెబుతారా ?
- అదేంటి ఆచార్యుల వారు. మా పాప గురించి ఎవరైనా మీకు కాంప్లైంట& చేశారా? ఎవరు చెప్పారు ? మా పాప అసలు మొబైల్‌తో కాలం గడుపదు. ఎవరైన మా బంధువులు మాట్లాడితే ముక్త సరిగా మూడు మాటలు మాట్లాడి మాకిస్తుంది.
- మీరు చెప్పిన విషయమే మీ పాప చెప్పింది. వాస్తవం తెలుసుకోవటానికి మీతో మాట్లాడాం.
- ఈ పాపను ఈ పాఠశాలో వేసిన తదుపరి స్వభావం చాలా మారింది. సంతోషంగా ఉంది.
- ధన్యవాదాలు మాతాజీ !

ఈ విధంగా ఒక బాలిక తల్లిని అడిగిన తదుపరి 10 మంది పిల్లల నుండి ముగ్గురు పిల్లలు జారుకు న్నారు. ఆ తరువాత మరో ముగ్గురు పిల్లల తల్లులతో మాట్లాడాను. అందరి సమాధానాలు కొద్ది మార్పుతో సుమారుగా ఇదే విధంగా ఉన్నాయి.

ఒక తల్లి మాట్లాడుతూ "మా పిల్లవాడు మొబైల్ చూడడు. కాని సాయంత్రం 1 గంట టి.వి. చూస్తాడు. అది కూడ మా పొరపాటే. మాకు కిరాణ దుకాణం శ్రామికులుండే వీధిలో యుంది. ప్రతి రోజు సా॥గం॥6.00ల నుండి 7.00ల వరకు గిరాకి ఎక్కువగా యుంటుంది. అందువల్ల నా ముగ్గురు పిల్లలను టి.వి. చూడమని నా భర్తకు సహకరిస్తుంటా ను. అందువల్ల మా అబ్బాయిని ఏమనకండి అని అంది. పిల్లవాడి తో మాట్లాడుతూ టి.వి. మానేస్తావా? అని అడిగితే ఇక నుండి అర గంట మాత్రమే చూస్తాను అని నిష్ఠతో చెప్పాడు.

మరునాడు ప్రార్థనా సమావేశంలో ఈ విషయాన్ని విద్యార్థుల ముందుంచి "మీలో కూడ మొబైల్‌ను ఉపయోగించని వారు (ఇతరులతో మాట్లాడటం తప్ప ఎందరున్నారు ? అని అడిగితే సుమారు 300 మందిలో 100 మంది విద్యార్థులు నిలబడ్డారు. వారందరిని ముందుకు పిలిచి తరగతి వారిగా నిలబెట్టి, తరగతి ఆచార్యులు వారి తల్లులతో మాట్లాడి వాస్తవం తెలుసుకోండి అని చెప్పగానే సుమారు 25 మంది వెనక్కి వెళ్ళారు.

పాఠశాల పరిశీలన అనంతరం మరో మూడు పాఠశాలల పరిశీలనకు వెళ్ళినప్పుడు ఈ విషయాన్నే విద్యార్థులను అడిగితే పాఠశాల మొత్తంలో ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే యున్నారు. నేషనల్ కర్రికులమ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ 2023లో పార్ట్-1లో స్కూల్ కల్చర్ అండ్ ప్రాసెస్ అనే చాప్టర్ యుంది. అందులో 18 పుటలు స్కూల్ కల్చర్ ఏ విధంగా యుండాలో చర్చించింది. దానిని చదవండి. ప్రతి పాఠశాల ఆచార్యులు, ప్రధానా చార్యులు, ప్రబంధకారిణీ సభ్యులు కలిసి విద్యార్థుల సంస్కృతిని పెంపొందించేందుకు యోజన చేసి దానిని అమలు చేసి అనుపమానమైన గుర్తింపును తెచ్చు కొంటారని ఆశిస్తున్నాను. ★

పుస్తక పరిచయం

# చదువు సరే... సంస్కారం ఎలా ?




## సదాచారం-2

శ్రీ సరస్వతీ విద్యాపీఠం
ప్రచురణ

**పుస్తక పరిచయం :** అద్దేపల్లి నరసింహారావు

**ఈ** పుస్తకాలకు ముందుమాట లాంటి **'ఒక్కమాట'** లో పుస్తకాల రచన నేపథ్యం గురించి ప్రాంత కార్యదర్శి వివరించారు. పిల్లలకు కావలసింది చదువు మాత్రమే కాదు, సంస్కారం కూడా కావాలి అని నొక్కి చెప్పారు. అందుకే శిశుమందిరాలలో ప్రభుత్వ పాఠ్య ప్రణాళికతో పాటు నైతిక, ఆధ్యాత్మిక విద్యని కూడా అందజేస్తున్నట్లు కార్యదర్శి వివరించారు. పిల్లల వయసు, తరగతిని బట్టి ఒక్కో సంవత్సరం పాఠ్య ప్రణాళిక ను రూపొందించారు రచయితలు, సమన్వయ కర్తలు.

ఒకటో తరగతి పుస్తకం **'పంచయజ్ఞ'** సిద్ధాంతంతో మొదలై నీతి కథలతో ముగుస్తుంది. రెండవ తరగతి పదహారు సూత్రాల ప్రణాళికతో ప్రారంభమై కథలతో ముగుస్తుంది. ఒకటి, రెండో తరగతి పుస్తకాలలో విషయం మారుతుంది కానీ బోధనా ప్రణాళిక ఒకటే విధంగా ఉంటుంది. ప్రార్థనా శ్లోకాలు, పద్యాలు, గేయాలు, సూక్తులు, చేయాల్సిన కృత్యాలు, కథలు, సాధించవలసిన అంశాలపై సూచనలు, భజనలు, ప్రాజెక్టు పనులు ... వీటన్నింటి సమాహారాలే ఈ పుస్తకాలు. నెలల వారీగా బోధనా ప్రణాళికను




సూచించారు రచయితలు. సందర్భోచిత రంగు రంగుల చిత్రాలు విద్యార్థి మానసిక ప్రపంచాన్ని అందంగా మారుస్తాయి. కథల తర్వాత చర్చకు పెట్టే ప్రశ్నలున్నాయి. **'సదాచారం'** పుస్తకాలలో మధ్య పేజీలలో విద్యార్థి భవితకు గట్టి పునాదులు వేసే ఒక చిత్ర పటం ఉంటుంది. ఈ చిత్రపటంలో ఒక చెట్టు ఆకుల ద్వారా సద్వ్యవహారం గురించి, మరో చెట్టు ఆకుల ద్వారా జీవన మూల్యాలు - ఆధ్యాత్మికత గురించి వివరించారు. **'మాతృ భూమి పట్ల భక్తి'**, **'సామాజిక చైతన్యం'**, **'సంస్కృతి నిష్ఠ'** అనే శీర్షికల కింద ఆయా అంశాలను సూక్ష్మ స్థాయిలో పేర్కొన్నారు. చదువు ఏ పాఠశాలలో అయినా దొరుకుతుంది, సంస్కారం .... శిశుమందిరాల బోధన ద్వారా మాత్రమే సాధ్యం.

**విద్యా భారతి ప్రణాళిక**

ఇప్పటి తరాల పిల్లలలో నైతిక విలువలు పెంపొందించేందుకు 'విద్యా భారతి' పాఠ్య ప్రణాళికను రూపొందించింది. ఉదయ్ తరగతి నుంచి పదవ తరగతి దాకా విద్యార్థుల కోసం 'సదాచారం' పేరుతో, నైతిక, ఆధ్యాత్మిక విద్యను అందించే లక్ష్యంతో, విద్యాభారతి ప్రణాళికను అనుసరించి పుస్తకాలను రూపొందించారు, ఎందరో మేధావులు, విద్యారంగ నిపుణుల కృషితో రూపుదిద్దుకున్న ఈ పుస్తకాలు పిల్లలను దేశభక్తి, సామాజిక స్పృహ, సంస్కారం ఉన్న పౌరులుగా అభివృద్ధి చేస్తాయి. ఉదయ తరగతి (జూనియర్ కె.జి.), ప్రభాత్ తరగతి (సీనియర్ కె.జి.) పుస్తకాలను పరిచయం చేసే వ్యాసాన్ని 'స్ఫూర్తి' పత్రిక అక్టోబర్ సంచికలో ప్రచురించారు. 'సదాచారం' పుస్తకాల పరిచయ వ్యాసాలు పరంపరలో ఇది రెండవది.

**రచన**

**రచయితలు:** శ్రీసరస్వతీ విద్యాపీఠం పూర్వ ప్రధానాచార్యులు డా॥ ముత్తేవి శ్రీనివాస్, పూర్వాచార్యులు శ్రీమతి ముత్తేవి లక్ష్మి.

**సహకారం:** శ్రీసరస్వతీ శిశుమందిర్ పూర్వ ప్రధానాచార్యులు శ్రీమతి అనురాధ, పూర్వ ప్రధానాచార్యులు శ్రీ బెల్లాల సుగుణాకర్

**సమన్వయం:**

దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి శ్రీ అయాచితుల లక్ష్మణరావు, దక్షిణ మధ్య క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ శ్రీ రావుల సూర్యనారాయణ

**ప్రతుల కోసం**

శ్రీసరస్వతీ విద్యాపీఠం, సాహిత్య విభాగం, ఇం.నెం.6-3-597/ఎ/7, వెంకటరమణ కాలనీ, ఖైరతాబాద్, హైదరాబాద్-04. ఫోన్.నెం.040-23316084, 9441866647లో సంప్రదించవచ్చు.

వెల: ఒకటో తరగతి పుస్తకం రూ॥50/-లు,
రెండో తరగతి పుస్తకం రూ॥55/-లు. ★

(26వ పుట తరువాయి భాగం ...)

మన పరిస్థితులకు అనుగుణంగా మార్చుకుని మాత్రమే స్వీకరించాలి. ఆ కొత్త విషయం మనలో ఉన్న మంచి లక్షణాలను, విలువలను నాశనం చేయకూడదు.

ఉదాహరణకు:

మనం క్యాల్క్యులేటర్‌ను స్వీకరించాము, ఇది తప్పు కాదు. కానీ ఇప్పుడు మన పిల్లలు గుణకార పట్టికలు (ఎక్కాలు) నేర్చుకోవడం మానేయాలనుకోవడం సరికాదు. ఇప్పుడతే "4x4=16" అని క్యాల్క్యులేటర్‌లో చూస్తే సరిపోతుంది అంటున్నారు. కానీ అలా చేస్తే భారతదేశపు పిల్లలు గణితంలో ఒలింపియాడ్ స్థాయిలో మెరుగైన ప్రతిభ చూపలేరు. భారతీయ విద్యార్థుల మేధస్సు ప్రపంచవ్యాప్తంగా పేరుపొందింది, ఎందుకంటే చిన్న వయస్సులోనే వారికి 25 వరకు, 30 వరకు గుణకార ఎక్కాలు కంఠస్థం చేయించేవారు. అంతేకాదు 1.5, 2.5 వంటి అర్థ సంఖ్యల పట్టికల పరిచయం ఉండేది. అందువల్లే, క్విజ్ లేదా వాదప్రతివాద పోటీల్లో ప్రశ్న పూర్తవకముందే వారు సమాధానం చెప్పగలిగేవారు.

వారి మెదడు తానే ఒక "సజీవ క్యాల్క్యులేటర్"గా పనిచేసేది. ఇప్పుడు క్యాల్క్యులేటర్లు, కంప్యూటర్లు వచ్చాయి. వాటితో లెక్కించడం సులువు. కానీ అవి పిల్లల స్మరణశక్తి, సామర్థ్యం, విశ్లేషణా శక్తి (Analytical Power) తగ్గించకూడదు. కాబట్టి మనం కొత్త సాంకేతికతలను స్వీకరిస్తూ, అదే సమయంలో మన మేధా బలాన్ని, మన సంప్రదాయ బలాన్ని కాపాడుకోవాలి.

కంప్యూటర్ వచ్చేసింది. ఇప్పుడు మనం రాయడం లేదు, కేవలం బటన్ నొక్కితే అక్షరాలు వస్తున్నాయి. కొన్ని అక్షరాలు టైప్ చేస్తే మాటే పూర్తి అయిపోతుంది. ఇలా చేస్తూ చేస్తూ మన సులేఖం (హస్తాక్షరం) చెడిపోవచ్చనే భయం ఉంది. భారతీయ పిల్లలు ఎంతో మేధావులు. వైద్య విద్యలో, ఐఐటీ (IIT)లో, ఐఐఎం (IIM)లో, ఐఏఎస్ (IAS) వంటి పరీక్షల్లో అగ్రస్థానాలు సాధిస్తున్నారు. కానీ ఒక లోపం మాత్రం కనిపిస్తోంది వారికి అందంగా రాయడం రాదు. వారి అక్షరాలు వంకరగా, అస్పష్టంగా మారాయి. ఇది మంచిది కాదు. సులేఖం అనేది మన దేశ ప్రతిభకు ప్రతీక. సాంకేతికత వచ్చింది, కానీ దాంతో మనలోని ఒక మంచి లక్షణం క్రమంగా నశిస్తోంది. మన పిల్లలు తప్పనిసరిగా అందంగా రాయడం నేర్చుకోవాలి. ఒక నెల క్రితం నేను ఢిల్లీలో ఉన్నాను. సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ వినీత్ నారాయణ్ గారి కుమార్తె గత 10-12 సంవత్సరాలుగా ఒక మంచి కార్యక్రమం నిర్వహిస్తోంది. "చిరునామా రాయండి, పోస్ట్ కార్డ్ పంపండి, అంతర్దేశీయ పత్రం రాయండి. మీ తల్లిదండ్రులకు, బంధువులకు, స్నేహితులకు ఉత్తరం రాయండి" అని ప్రజలను ప్రోత్సహిస్తోంది.

వేలాది మందితో ఉత్తరాలు రాయించి, ప్రతి సంవత్సరం వాటి ప్రదర్శన నిర్వహిస్తుంది. ఢిల్లీ లోని గాంధీ స్మృతి మందిరం వద్ద జరిగిన ఒక ప్రదర్శనకు నేను వెళ్లాను. అక్కడ ఎంతో అందమైన అక్షరాలతో రాసిన పత్రాలను చూసి ఆశ్చర్యపోయాను.

ఆ అమ్మాయి నాతో చెప్పింది. "చాచా జీ, నేను ఆలోచిస్తున్నాను. ఇది కొనసాగకపోతే, ప్రజలు రాయడం మానేస్తారు. సరే, మన దగ్గర SMS ఉంది, WhatsApp ఉంది, క్షణాల్లోనే సందేశం పంపగలం. కానీ లేఖ మాత్రం శాశ్వతం. 50 సంవత్సరాల తరువాత కూడా దాన్ని చూడొచ్చు. 50 సంవత్సరాల తరువాత WhatsApp లో ఏమి ఉంటుంది ? కనీసం మన చేతిరాత కూడా దొరకదు." అందుకే మన పిల్లల హస్తలేఖనం (Handwriting) చెడిపోకుండా జాగ్రత్త పడాలి. కంప్యూటర్ మన ప్రతిభను, మన మానవ స్పర్శను హరించకూడదు. సాంకేతికతను ఉపయోగించుకోవాలి, కానీ మన అందమైన అక్షరాల సంప్రదాయంను మాత్రం కాపాడుకోవాలి. ★

---

**నీళ్ళు లేని బావి.. కళ్ళు లేని శరీరం ..**
**పండ్లు లేని చెట్టు .. దీపం లేని దేవాలయం ..**
**ఎటువంటిదో ....**
**భక్తి లేని మానవుడు కూడా ఆ కోవకే చెందుతాడు.**

**- శారదామాత**

# మాతృభాషలో విద్యాబోధన

శ్రీ సురేశ్ సోనీ
అ.భా. విద్యాభారతి పూర్వప్రభారీ
– తెలుగు అనువాదం కె.వి. సత్యనారాయణ

మనకు కొన్ని విషయాలపై ఆసక్తి ఉంటుంది. దానిని కార్యరూపంలో తేవడంలో కొన్ని ఇబ్బందులొస్తాయి. ద్వంద్వాలు తలెత్తుతాయి. కొన్నిటిని మనం సరిచేసు కోగల్గుతాము, కాని కొన్నిటిని ఎల్లప్పుడూ ఆలోచన చేయాల్సి ఉంటుంది. ముందుకెళ్లాల్సి వస్తే ఏమి చేయాలి? ఎలా ముందుకెళ్లాలి?

ఆధారభూత విషయాల పరివర్తన గూర్చి ఆలోచించాలి. స్వ ఆధారంగా నడుస్తూ వస్తున్నాం. మనం చేసేపని స్వ పైననే ఆధారంగా చేస్తున్నాం. మనం దానినే చెపుతున్నాం. పరివర్తన చేయడానికి కావలసిన వాహకులం మనం. దానిపట్ల తేడా రాకూడదు. మన కార్యం పట్ల దృఢత, విశ్వాసం ఉన్నాయి. అయినా కొన్నిచోట్ల విషమ పరిస్థితులున్నాయి. వాటినెట్లా అధిగమించాలి? కొన్నిచోట్ల భవనాలున్నాయి. పాఠశాలలో సంఖ్య తగ్గిపోతోంది. ఏమి చేయాలి మరి. ఆంగ్లభాష మాధ్యమంగా పాఠశాలను మార్చాలి! దేశమంతటి దృష్ట్యా మార్పును గమనించాలి. తదనుగుణంగా కార్యనిమగ్నులం కావాలి.

మానవజన్మ ఒక విశేషమైనట్టిది. దానిపట్ల మనకున్న ఆసక్తి భిన్నమైనది. వికాసం చెందటం చూస్తూనే ఉన్నాం. జ్ఞానేంద్రియాలు మిగతా పనులు వికాసం చెందుతూనే ఉన్నాయి. వాటి వికాసం కొరకు అనుకూల యోగ్యత కావాలి. దాని కొరకు శోధన చేశారు, చేస్తున్నారు. విక్రమ్ సారాభాయి, హోమిజహంగీర్ బాబా, అబ్దుల్ కలామ్ వీరందరూ తమ మాతృభాషలోనే ఎదిగారు. 10వ తరగతి వరకు మాతృభాషలోనే చదివారు. ఇంగ్లీషు కూడా వారికి బాగానే వచ్చింది.

బాలబాలికలు వయసు పెరిగే కొద్దీ వారి బుద్ధి వికాసం కూడా పెరుగుతుంది. మనదేశంలో ఉచ్చశిక్షణ, పోటీ పరీక్షలన్నియు ఆంగ్లములో జరుగుతున్నాయి. కనుక పోషకులు తమ పిల్లలను ఈ పోటీలలో విజయం సాధించాలంటే ఆంగ్లభాష ఉన్నచోటికే పంపుతున్నారు. ప్రభుత్వం ఈ దిశలో మార్పులు చేయాలి. విధానం మార్చాలి. ఇప్పుడున్న పరిస్థితి మారాలంటే 10 సంవత్సరాలు పడుతుంది. ఇజ్రాయిల్లో శిక్షణ హిబ్రూ భాషలోనే, చైనాలో మందారిన్లో జర్మనీలు జర్మనీలో, ఫ్రాన్స్లో ఫ్రెంచిలో. ఈ దేశాలలో విజ్ఞాన శాస్త్ర పరిశోధన వికసింపబడుతోంది. ఒక దేశం నుండి ఇంకొకరి పరిజ్ఞానం అందిస్తున్నారు. పరస్పర అవగాహన జరుగుతోంది. మన ప్రధాని పదేపదే 140కోట్ల మందికి మనం విజ్ఞానం అందించాలని అంటున్నారు. నేటికీ 5 శాతం వరకే అందుతోంది. ఆంగ్లభాష వచ్చినవారే రాణిస్తున్నారు. ఇది పెరగాలంటే వీటిని మన భాషలన్నిటిలోకి ఈ విషయం అందే వ్యవస్థ చేయాలి.

భారతీయ భాషాసమితి ఏర్పడింది. ప్రతిభాష శబ్దకోశము తయారు చేసింది. కాని పరిశోధనకు అందినంతగా లేదు. అకాడమిస్టులు ఈ విషయమై ప్రయత్నము చేస్తున్నారు. కౌశల నిర్మాణం అభివృద్ధికై పాఠ్యాంశాలు రూపొందాలి. ఇది త్వరగా జరగాలి. NCERT ద్వారా చేయబడిన పుస్తకాలు కూడా 3 భాషల్లోనే ఉన్నాయి. ఆంగ్లం, హిందీ. ఉర్దూల్లో. 22 భాషల్లో రావాలి. AICTE అనువాద సాధనను ప్రోత్సహిస్తోంది. ఇ-బుక్, ఆన్లైన్లు లభ్యమౌతున్నాయి. పుస్తకాలు రాలేదు. 8000 మంది విద్యార్థులు ఒడిసాలో సాధన చేస్తున్నారు. సామగ్రి డౌన్లోడ్ చేసుకున్నారు. నేడు వీటిపై భారం పెరుగుతోంది. వైద్య ఇంజనీరింగ్, సాంకేతిక విజ్ఞానం పట్ల ఆదరణ పెరిగింది. ఆంగ్లమావశ్యకమైంది. ★

**మనకు లభించే చిన్న అవకాశాలే భవిష్యత్తులో ఉన్నత శిఖరాల్ని చేరుస్తాయి.** – బెంజిమిన్ ఫ్రాంక్లిన్



## సేవాబస్తీ వాసుల హృదయాలలో విద్యా భారతి విజ్ఞాన కేంద్రము నాదర్ గుల్...

**బడంగపేట్ :–** బడంగపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని (హైదరాబాద్) మారు మూల వెనుకబడిన బస్తీలలోని బాల బాలికలకు సంస్కార కేంద్రము ద్వారా విద్యాభారతి విజ్ఞాన కేంద్రము నాదర్ గుల్ చక్కటి ప్రయత్నము చేస్తున్నదని మాజీ కార్పొరేటర్ మాతృమూర్తి శ్రీమతి నిమ్మల సునీత గారు పేర్కొన్నారు .

భవిష్యత్తులో విద్యాభారతి విజ్ఞాన కేంద్రము నాదర్‌గుల్ బడంగపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో విద్యారంగమునకే ఆదర్శముగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పుస్తకములను అందచేశారు. బాగా చదువుకొని దేశానికి చక్కటి పేరు తీసుకొనిరావాలని సంస్కార కేంద్ర బాలబాలికలకు సూచించారు.

సంస్కార కేంద్రము నిర్వహిస్తున్న చిరంజీవి పల్లవిని అభినందించారు. ఈ కార్యక్రమములో పాఠశాల సేవా సంయోజక్ మాతృమూర్తి శ్రీమతి రచన, బస్తీలోని మాతృమూర్తులు పాల్గొన్నారు. ★

---




**నారాయణపేట:–** శ్రీ సరస్వతీ శిశు మందిర్ నారాయణపేట జిల్లా కేంద్రంలో అశోక్ నగర్ మాధ్యమిక పాఠశాలలో సంస్కార కేంద్ర నిర్వాహకుల మరియు సేవా ప్రముఖుల వర్గ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమములో ప్రాంత సంస్కార కేంద్ర నిర్వాహకుల ప్రముఖ శ్రీ గంగాధర్ రెడ్డి గారు, విభాగ్ కార్యదర్శి శ్రీ కుంటి ఎల్లప్ప గారు, జిల్లా అధ్యక్షులు శ్రీ గోపన్ భాయ్ బాలరాజు గారు, జిల్లా విద్వత్ కన్వీనర్ శ్రీ లక్ష్మయ్య గౌడ్ గారు, అశోక్ నగర్ పాఠశాల మార్గదర్శకుడు శ్రీ సత్యనారాయణ గారు, పాఠశాల అధ్యక్షులు శ్రీ డాక్టర్ కృష్ణారెడ్డి గారు మాతృమండలి సభ్యురాలు సహసేవ ప్రముఖ పల్లా వసంతిక గారు పాల్గొన్నారు. ★

---



**నాగర్ కర్నూల్:–** శ్రీ సరస్వతీ శిశు మందిర్ నాగర్ కర్నూల్ పాఠశాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు తెలంగాణ జిల్లాల్లోని ప్రతి పట్టణం, పల్లెల్లోజరగనున్న తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు బతుకమ్మ ఉత్సవాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ సంబరాల వేడుకల నిర్వహణపై స్థానికులు విద్యార్థులను అభినందించారు . ఈ సందర్భంగా విద్యార్థుల ఆట,పాటలు అలరించాయి. ఈ కార్యక్రమాల్లో పాఠశాల అధ్యక్షులు రమేష్ బాబు గారు కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గారు ప్రధానోపాధ్యాయులు ప్రసన్న లక్ష్మి గారు మాతృ మండలి పోషకులు ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు చిన్నారులు పాల్గొన్నారు. ★




**జమ్మికుంటలో జరిగిన విభాగ్ స్థాయి గణిత-విజ్ఞాన-సాంస్కృతిక మేళాలో శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు ఆనందోత్సవాలు....**

జమ్మికుంట పట్టణం శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విభాగ్ స్థాయి (కరినగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట జిల్లాలు) గణిత-విజ్ఞాన-సంస్కృతీ విజ్ఞాన మేళ కార్యక్రమం రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో 16 పాఠశాలల నుండి సుమారు 350 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరై మంచి మంచి ప్రయోగాలు నిర్వహిస్తూ జడ్జీల ద్వారాను మరియు వివిధ పాఠశాల విద్యార్థుల ద్వారా మెప్పు పొందారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఎంతో సంతోషం వెలిబుచ్చారు. మేము రాష్ట్ర, జాతీయ స్థాయిలలో కూడా పాల్గొని జమ్మికుంటని స్ఫూర్తిగా తీసుకుంటామని ఆనందాన్ని వెలుబుచ్చారు, ఈ రెండు రోజుల కార్యక్రమంలో మొదటిరోజు ఉద్ఘాటనలో ముఖ్యఅతిథిగా శ్రీమతి మంతెన హేమలత గారు పాల్గొని విద్యార్థులు ఎంతో చక్కగా సైన్స్ ఎగ్జిబిట్స్ తయారు చేసి వివరణ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త డాక్టర్ చిట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ మన నిత్యజీవితంలో గణితం వల్ల ఎంతగానో ఉపయోగ ఉంటుందని అలాగే చిన్ననాటి నుండే సైన్స్ పట్ల అభిలాషను పెంచుకొని సైంటిస్టులుగా ఎదగాలని తెలిపారు. శ్రీ నీలం వెంకటేశ్వర్లు గారు సైంటిస్ట్ కృషి విజ్ఞాన కేంద్రం వీరు మాట్లాడుతూ మన పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మనకు మనుగడ లేదని తెలిపినారు.

గవర్నమెంట్ డిగ్రీ పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ బొడ్డు రమేష్ గారు, శ్రీ ముక్కాల సీతారాములు గారు కరీంనగర్ విభాగ్ అధ్యక్షులు, శ్రీ తేళ్ళ రాజమౌళి గారు, సిరి సరస్వతీ దేవి కరీంనగర్ జిల్లా కార్యదర్శి, డాక్టర్ కనివేని తిరుపతి గారు, శ్రీ బొడ్ల శ్రీనివాస్ గారు సరస్వతీ విద్యాపీఠం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మరియు డాక్టర్ దేవేందర్ రెడ్డి, డాక్టర్ రాము పాల్గొన్నారు. రెండవ రోజు ముగింపు కార్యక్రమంలో శ్రీ మేచినేని దేవేందర్ రావు గారు శ్రీ సరస్వతీ విద్యాపీఠం కరీంనగర్ విభాగ్ కార్యదర్శి , సమితి అధ్యక్ష కార్యదర్శులు శ్రీ ఆవాల రాజారెడ్డి, ఆకుల రాజేందర్, ప్రబంధకారిణి అధ్యక్ష కార్యదర్శులు శీలం శ్రీనివాస్, దాసరి రవీందర్ గారు మరియు పోషకులు పాల్గొన్నారు. ★

---



**ఆసిఫాబాద్ :-** శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఆసిఫాబాద్ పాఠశాలలో ప్రబంధకారిణి మరియు జిల్లా కార్యకారిణి సమావేశంలో మార్గదర్శనం చేస్తున్న శ్రీ రావుల సూర్య నారాయణ దక్షిణ మధ్య క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ గారు వారితోపాటు విభాగ్ కార్యదర్శి శ్రీ దహెగాం గోవిందరావు గారు మరియు విభాగ్ అకడమిక్ ఇంచార్జ్ శ్రీ పూదరి సత్యనారాయణ గారు పాల్గొన్నారు. ★




**శ్రీ శారదాధామము:–** శక్తి ఉపాసనా పవిత్ర దినమైన నవ రాత్రులలో పవిత్ర శ్రీ శారదామాత వేంచేసి ఉన్న శ్రీ శారదాధామము ప్రాంగణములో శిశు మందిర విద్యార్థులు సంగీతము, ఘోష్, కళాత్మక అంశములను దీక్షతో స్వీకరించి ఆపోసన పట్టడం విశేషం.

ఈ వర్గలో తాము నేర్చుకున్న విషయములను అతి తక్కువ సమయములో ప్రదర్శించడం కూడా విశేషం. ముగింపు కార్యక్రమములో శ్రీ సరస్వతీ విద్యా పీఠము తెలంగాణా అధ్యక్షులు డాక్టర్ తిరుపతి రావు గారు, శ్రీ సరస్వతీ విద్యా పీఠము ప్రాంత కార్యదర్శి శ్రీమతి అనఘా వెంకట లక్ష్మి గారు మరియు ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయసింహా రెడ్డి గారు పాల్గొన్నారు .

ముగింపు కార్యక్రమములో శ్రీ సరస్వతీ విద్యా పీఠము తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ తిరుపతి రావు గారు మార్గదర్శనం చేస్తున్న దృశ్యం. ★

---




విద్యా భారతి ఆంధ్ర ప్రదేశ్ సప్తశక్తి సంగమ్ వక్త మహిళ కార్యకర్తల కార్యశాల నిర్వహించిన ప్రాంత కార్యదర్శి జెపిఎస్ శాస్త్రి, సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్, ప్రాంత ప్రముఖ్ డా॥ రాధాబాయ్, ప్రధానాచార్యులు లక్ష్మి ★

---



## సరస్వతీ మాత పూజా కార్యక్రమము

**కామారెడ్డి:–** శ్రీ సరస్వతీ విద్యామందిర్ హై స్కూల్ కామారెడ్డి సరస్వతీ మాత పూజ కార్యక్రమంలో పాల్గొన్న విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి శ్రీ అయాచితుల లక్ష్మణ రావు గారు. ★

## శ్రద్ధాంజలి

**ఆదర్శనగర్:–** శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఆదర్శనగర్–కాగజ్‌నగర్ పాఠశాల సలహా సమితి సభ్యులు శ్రీ పురుషోత్తం జవారే గారు పరమపదించారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తూ శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆదర్శనగర్ పాఠశాల ప్రబంధకారిణి శ్రద్ధాంజలి ఘటించింది. ★







కామారెడ్డి :- శ్రీ సరస్వతీ శిశుమందిర్ కామారెడ్డి ఉన్నత పాఠశాల వారి అధ్వర్యంలో సప్త శక్తి సంగమం కార్యక్రమాన్ని ఉన్నత విద్యార్థుల మాతృమూర్తులతో నిర్వహించారు. ఇందులో శ్రీమతి బొంతపల్లి కల్పన పూర్వ విద్యార్థిని. రాష్ట్ర సేవికాసమితి కామారెడ్డి జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ మాట్లాడుతూ కుటుంబం ఎలా ఉండాలి, కుటుంబ సభ్యులతో ఎలా మెలగాలి, ఉమ్మడి కుటుంబం యొక్క ఆవశ్యకతతో పాటు పర్యావరణం పైన పోషకులకు చక్కగ అవగాహన కల్పించారు. ఆ తర్వాత,నందికంటి శ్రీలత ... రాష్ట్ర సేవికాసమితి నగర బౌద్ధిక్ ప్రముఖ్ మాట్లాడుతూ పిల్లలను ఈ రోజుల్లో ఎలా పెంచాలో, మన సనాతన కాలం నుండి ప్రస్తుత కాలం వరకు వీరనారీమణుల శక్తి సామర్థ్యాలను తెలియజేశారు శ్రీమతి గుజరాతి సరోజ గారు ఇందూర్ భాగ్ కార్యవాహిక కార్యక్రమాన్ని ఉ ద్దేశించి అధ్యక్ష భాషణం చేశారు ఇందులో ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మాతలు సందేహాలు నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానాచార్యులు, మరియు వివిధ పాఠశాలల మాతాజీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 200 మంది పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.



బాలల సమగ్ర వికాసంలో మహిళల పాత్ర ముఖ్యమైనది

కుషాయిగూడ:- శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత ఉన్నత పాఠశాల కుషాయిగూడలో విద్యాభారతి అఖిల భారత శిక్షా సంస్థాన్ మరియు శ్రీ సరస్వతీ విద్యాపీఠం ద్వారా యోజన చేయబడిన సప్తశక్తి సంగమం మాతృ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ సరస్వతీ విద్యాపీఠం మేడ్చల్ జిల్లా సభ్యులు ఉమారాణి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ, పర్యావరణం మహిళలలో ఆత్మాభిమానం క్రియాశీలత పెంపొందించుకోవడం గురించి వివరించారు. కుటుంబం, సమాజం, సామాజిక సమరసత, బాలల సమగ్ర వికాసంలో మహిళల పాత్ర చాలా ముఖ్యమైనది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలను చైతన్య పరచడం కోసం ఇలాంటి కార్యక్రమాలు శ్రీ సరస్వతీ విద్యాపీఠం ద్వారా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా విశిష్ట మహిళలను సన్మానించారు. పాఠశాల పూర్వ ఆచార్యులు కామేశ్వరి, వసంత, పాఠశాల కమిటీ కోశాధికారి శ్రీ లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రాధిక ఆచార్యులు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

RNI No. : 32283
SPHOORTHY (MONTHLY)
Volume : 50 Issue : 11
November - 2025

Postal Reg. No. : D/RNP/HCD-1204/2024-26
Published on 25th of Every Month
Posted on 29th & 30th Every Month
Posting at BPC-IV Partika Channel, Nampally, Hyderabad-01






## కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన విద్యారణ్య ఆవాస విద్యార్థులు

జమ్మికుంట:- క్షేత్రస్థాయిలో మూడు రాష్ట్రాల్లో కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన విద్యారణ్య ఆవాస విద్యార్థులు. విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ భాగంగా క్షేత్రస్థాయి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలో జరిగిన కబడ్డీ పోటీల్లో విద్యారణ్య ఆవాసవి ద్యాలయం, కేశవపురము జమ్మికుంట విద్యార్థులు ద్వితీయ స్థానంలో గెలుపొందారు. వీరికి పాఠశాల తరుపున ప్రధానాచార్యులు పొలసాని సుధాకర్ రావు, ఆచారి పోతన శ్రీకాంత్, ఆచార్యుల బృందం శుభాకాంక్షలు తెలిపారు.



## యస్ జి యఫ్ జిల్లాస్థాయి గేమ్స్ కి ఎంపిక

కామారెడ్డి:- జిల్లా స్థాయి టోర్నమెంట్ కబడ్డీ అండర్ 14 బాయ్స్ అండ్ గర్ల్స్ కబడ్డీ పోటీలకు శ్రీ సరస్వతి శిశు మందిర్ హై స్కూల్ కామారెడ్డి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. జిల్లాకి కబడ్డీ కెప్టెన్ గా అంకం రిషిక 8వ తరగతి మరియు బి అస్మిత ఎంపికయ్యారు. జరగబోయే ఉమ్మడి జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలకు కామారెడ్డి జిల్లా తరఫున ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల ప్రధానాచార్యులు తెలిపారు.

స్పిన్:- భాగ్యనగర్ విభాగ్ లోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా దక్షిణ మధ్య క్షేత్ర స్థాయిలో "చక్రములు అమర్చి ఉన్న బూట్లను ఉపయోగించి ఉపరితలముపై జారుతూ కదలడం" (స్కేటింగ్) పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు గారు, దక్షిణ మధ్య క్షేత్ర కోశాధికారి పసర్తి మల్లయ్య గారు, శ్రీ సరస్వతీ విద్యా పీఠము ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు గారు మెమెంటోలు మరియు ప్రశంసా పత్రములను అందచేస్తున్న దృశ్యం.

